గ్రామ కమిటీ ఎన్నికల్లో వాగ్వాదం
● దూషించుకున్న తెలుగు తమ్ముళ్లు
6
మంత్రి వచ్చారు.. వెళ్లారు...
● జూనియర్ కళాశాలలో పరిష్కారం కాని సమస్యలు

తోతాపురికి ఊరట

- 16 వేల టన్నుల మామిడికాయలు ఫ్యాక్టరీలకు తరలింపు
- ప్రభుత్వం అదనంగా చెల్లిస్తున్న రూ.4
- పల్ప్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న కాయలు
- మరో 6 వేల టన్నులు రావచ్చని అంచనా

మదనపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తోతాపురి సాగు చేస్తున్న మామిడి రైతుకు ప్రభుత్వం ఇస్తున్న రూ.4 సబ్సిడీ వారికి ఆసరాగా నిలుస్తోంది. రైతుకు వ్యాపారి చెల్లించే మొత్తానికి అదనంగా ప్రభుత్వం సబ్సిడీ రూపంలో చెల్లిస్తోంది. గత నెల 9వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన ఈ విధానంపై క్షేత్రస్థాయిలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, వ్యవసాయ, సచివాలయ, సహకార శాఖ అధికారులు పనిచేస్తున్నారు. ఈ ఏడాది సీజన్‌లో మామిడి పంటకు సరిపోయేలా గతేడాది నవంబరు, డిసెంబరులో మంచి వర్షాలు కురిశాయి. దీంతో దిగుబడితో పాటు తోతాపురి (బెంగళూరు రకం) కాయసైజు పెరిగి టన్నేజీ ఎక్కువగా వచ్చినట్లు ఉద్యానశాఖ చెబుతోంది. ఈ క్రమంలో సీజన్ ప్రారంభం ఏప్రిల్‌లో మంచి ధరలు ఉన్నా తర్వాత ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. అప్పటి వరకు తోతాపురి కిలో రూ.10 నుంచి రూ.12 ఉండగా, తర్వాత కిలో రూ.3 నుంచి రూ.4 పడిపోయింది. దీంతో కాయలను మార్కెట్‌కు తీసుకొచ్చే కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు అప్పటికే కోసిన కాయలను రోడ్డుపక్కన గుట్టలు గుట్టలుగా పారేయడం, మరికొందరు రైతులు కోయకుండా అలాగే చెట్లకు కాయలను వదిలేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. మరోవైపు మండీల్లో ఈ వ్యాపారులు తోతాపురి రకాన్ని కొనేందుకు ముందుకు రాలేదు. కొన్నిచోట్ల అయితే ఊరికే ఇచ్చినా వద్దనే పరిస్థితి వచ్చింది. ఈ విషయాన్ని మామిడి రైతులు అటు అధికారులు, ఇటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం స్పందించి మామిడి రైతును ఆదుకునేందుకు ముందుకొచ్చి వ్యాపారుల ఇచ్చే ధరకు అదనంగా రూ.4 సబ్సిడీ ఇస్తుండటంతో రైతుకు కొంత ఆసరాగా నిలుస్తోంది.



మదనపల్లెలో మండీలో మామిడి కాయలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానాధికారి సుభాషిణి

జిల్లాలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రైల్వేకోడూరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ఏరియాల కొంతభాగంలో మామిడి పంటలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో అన్ని రకాల మామిడి పంటలు 31,950 హెక్టార్లలో సాగులో ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఇందులో 8,934 హెక్టార్లలో తోతాపురి సాగులో ఉంది. వీటి నుంచి 50,490 టన్నుల దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ లెక్కలు వేయగా, అంతకు మించీ మార్కెట్‌ను ముంచెత్తింది. దీంతో ధర క్రమంగా తగ్గుతూ పాతాళానికి చేరుకుంది. అన్ని రకాల మామిడి రకాలు కొంతలో కొంత మెరుగ్గా ఉండగా కేవలం తోతాపురి మాత్రమే ధరలు తగ్గుముఖం పట్టాయి. అది కూడా ఎరుపు రంగులోని కాయ తినడానికి వెళ్లే రకాన్ని పక్కన పెడితే జ్యూస్ ఫ్యాక్టరీకి (పల్ప్) వెళ్లే రకాల ధరలు బాగా తగ్గాయి. ఈ రకం పండించిన రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇందుకోసం ఉద్యాన, ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో టీములు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల నుంచి రైతులు మండీలకు తీసుకొచ్చే కాయలను నమోదు చేస్తోంది. రైతు పేరు, ఎన్ని టన్నులు, మండీ పేరు, అక్కడి నుంచి ఏ ఫ్యాక్టరీకి వెళ్తోందనే వివరాలు నమోదు చేస్తున్నారు. తిరిగి ఈ వివరాల ఆధారంగా ఆయా ఫ్యాక్టరీల వద్దకు వెళ్లి రైతుకు ఇచ్చిన ట్రిప్ షీట్, ఫ్యాక్టరీలోని వివరాలపై ఆడిట్ చేస్తున్నారు.



తోతాపురి మామిడి కాయలు



మార్కెట్‌కు వచ్చిన కాయలు

చిత్తూరు జిల్లాలో 13 ఫ్యాక్టరీలను గాను 30 మందిని సహకార శాఖ ఆడిటర్లను నియమించారు. అలాగే అన్నమయ్య జిల్లాలో ఒక ఫ్యాక్టరీ, 125 మామిడి మండీలు ఉండగా, ఒక్కో మండీలో ముగ్గురు చొప్పున విడతల వారీగా 200 మందిని నియమించారు. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల మండీల నుంచి మామిడిని చిత్తూరు, తిరుపతి జిల్లాలోని ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో ఒక పల్ప్ ఫ్యాక్టరీ ఉండగా, చిత్తూరు, తిరుపతి జిల్లాలో 30 ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఒక అన్నమయ్య జిల్లాలో తీసుకుంటే ఇప్పటి వరకు రోజువారీ 500 మెట్రిక్ టన్నుల చొప్పున 16,011 టన్నులు, ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు 948 టన్నుల ఫ్యాక్టరీలకు సరఫరా చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికే రాయచోటి, రైల్వేకోడూరు ఏరియాలలో కాయలు తగ్గుముఖం పట్టగా పీలేరు, మదనపల్లెలో పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇలా ఈనెల 15వ తేదీ వరకు మరో 6 వేల టన్నులు దిగుబడి రావచ్చని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యాపారుల మండీల ద్వారానే కాకుండా, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు) నుంచి వీటిని రోజువారి కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా ఉద్యానాధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి పర్యవేక్షిస్తూ నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నారు.

వైభవంగా ధ్వజారోహణం

- యాలివాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సునీల్‌కుమార్, పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సాయి స్వామి ఆధ్వర్యంలో గరుడ పతాకాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి యాలి వాహనంపై మహా తేజోవంతుడు సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేషాలంకరణలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పల్లకీసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హంసవాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



యాలివాహనంపై విహరిస్తున్న సౌమ్యనాథస్వామి



ధ్వజారోహణం నిర్వహిస్తున్న పండితులు

కుర్నూతల అగ్రహారంలో సీఐడీ విచారణ

- వైసీపీ నాయకులపై మండ్ల లోకేశ్ ఫిర్యాదు



కుర్నూతల అగ్రహారంలో విచారణ చేస్తున్న సీఐడీ ఎస్పీ శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నూతల అగ్రహారంలో తిరుపతి నుంచి వచ్చిన సీఐడీ ఎస్పీ శ్రీనివాసులు శనివారం గ్రామస్థులను విచారించారు. వైసీపీ నాయకులు గత ఏడాది సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కుర్నూతల అగ్రహారంలో టపాసులు పేల్చిన సంఘటనలో మండ్ల లోకేశ్ అనే వ్యక్తి ఒక కన్ను కోల్పోయాడు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలంటూ ఆయన జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు వైసీపీ నాయకులపై ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం తిరుపతి సీఐడీ ఎస్పీ శ్రీనివాసులు తమ సిబ్బందిలో కలిసి కుర్నూతల అగ్రహారం గ్రామంలో ఫిర్యాదుదారుడితో పాటు గ్రామస్థులను విచారించారు. కార్యక్రమంలో సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, వీఆర్‌వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరిక

రాయచోటిటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఘటన గురించి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జాతీయ భద్రతకు భంగం కలిగించేలా సోషల్ మీడియా ఇతర ప్రసార మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసినా, అవాస్తవాలను సృష్టించినా, పుకార్లు ప్రసారం చేసినా, షేర్ చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాల్లో గ్రూప్ అడ్మిన్‌లు ప్రతి సమాచారాన్ని తనిఖీ చేసుకోవాలని, ఒకవేళ ఆయా గ్రూపుల్లో తప్పుడు సమాచారం వస్తే గ్రూప్ అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామన్నారు. రాయచోటి ఘటన గురించి ఈనెల 3వ తేదీ పత్రికా ప్రకటన జారీ చేశామని, ఈ విషయం గురించి కేంద్ర దర్యాప్తు బృందం విచారణ చేస్తోందని తెలిపారు. సమాజంలో ముఖ్యంగా మీడియా పాత్ర విలువైనదని, పోలీసు శాఖకు సహకరించాలన్నారు. ఎటువంటి విషయాలు ఉన్నా అధికారికంగా అన్నమయ్య జిల్లా పోలీసు వారు తెలియజేస్తారన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం చాలా తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని, చట్టపరమైన పర్యవసానాలు కఠినంగా ఉంటాయని, కావున అవాస్తవాలు ప్రచారం చేయవద్దని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా మెగా పీటీఎం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 10వ తేదీ మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామని, తల్లి పేరుతో ప్రతి విద్యార్థితో మొక్క నాటించడం ద్వారా తల్లిదండ్రులు, పర్యావరణం పట్ల బాధ్యత పెరుగుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహించనుందని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మీట్ జరగబోయే రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపులో భాగంగా విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులకు సమస్కరించి అమ్మ పేరు మీద మొక్క నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పాఠశాలల వారీగా ప్రజాప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు, పాఠశాల కమిటీలు, దాతలు, తల్లిదండ్రులు భాగస్వాములై పిల్లల భవిష్యత్తుకు నూతన బాటలు వేయాలని కోరారు. సమావేశంలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, పాఠశాల విద్యాశాఖ ప్రతినిధి జనార్ధన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

చుక్కలు చూపించిన 'ఏడుకొండలు'

- ఐదున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచిన రైలు

ములకలచెరువు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడుకొండలు ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం ఐదున్నర గంటలకు పైగా ఆలస్యంగా నడిచి ప్రయాణికులకు చుక్కలు చూపించింది. దీంతో రైలులో ఉన్న ప్రయాణికులు, రైలు ఎక్కాల్సిన ప్రయాణికులు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. సికింద్రాబాద్‌లో బయలుదేరిన రైలు మహబూబ్‌నగర్‌కు వచ్చేసరికి సాంకేతిక కారణాలతో ఐదు గంటల పాటు నిలిచిపోయింది. దీంతో ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 8.27 గంటలకు వచ్చింది. ఐదున్నర గంటలకుపైగా ఆలస్యంగా వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్లాల్సిన ఈ రైలు ఉదయం 11.14 గంటలకు చేరింది. దీంతో రైలులో ఉన్న ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.



ములకలచెరువుకు ఆలస్యంగా వచ్చిన ఏడుకొండలు ఎక్స్‌ప్రెస్ రైలు

అందుబాటులోకి రాని సదరమ్ స్లాట్ బుకింగ్స్



కలికిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల సర్టిఫికెట్ల జారీ కోసం నిర్దేశించిన సదరమ్ స్లాట్ బుకింగ్స్ శనివారం కూడా సాధ్యపడలేదు. గురువారం నుంచి బుకింగ్స్ ప్రారంభించాలని రాష్ట్ర సెకండరీ హెల్త్ శాఖ ప్రతిపాదించినా గ్రామ వార్డు సచివాలయాల డైరెక్టరేట్ సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను గడువు నాటికి సిద్ధం చేయలేకపోయింది. ఫలితంగా సదరమ్ వైబ్‌సైటు ఆచూకీనే లేకపోయింది. దీంతో బుకింగ్‌లు వాయిదాపడ్డాయి. 5వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్‌లు ప్రారంభించుకోవచ్చని సచివాలయాలకు మౌఖిక సూచనలందాయి. స్లాట్‌ల బుకింగ్‌ల కోసం పలువురు దివ్యాంగులు శనివారం సచివాలయాలకు వచ్చినా సాయంత్రం వరకు ఒక్క బుకింగ్ కూడా మొదలు కాలేదు. వైబ్‌సైటు అందుబాటులోకి వచ్చినా మండలం పేరు ఎంపిక చేసుకున్నా ఆ తరువాత కనబడాల్సిన ఆసుపత్రుల జాబితా మాత్రం రాలేదు. శనివారం సాయంకాలం 5 గంటల వరకూ ప్రయత్నించినా ఇదే పరిస్థితి కనపడటంతో పలువురు నిరాశగా వెనుదిరిగారు. ఇక సోమవారమైనా బుకింగ్‌లు అందుబాటులోకి వస్తాయా లేదా అన్న విషయం మాత్రం స్పష్టం కావడం లేదు.

ఉగ్రవాదుల కేసులో రహస్యంగా విచారణ

- రంగంలోకి కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు బృందాలు

రాయచోటి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో దొరికిన ఉగ్రవాదులతో సన్నిహితంగా మెలిగిన, ఉగ్రవాదులకు సహకరించిన వారిని పోలీసులు మూడు రోజులుగా రహస్యంగా విచారిస్తున్నారు. ఈ విచారణ మొత్తం కేంద్ర స్థాయిలోని అత్యున్నత దర్యాప్తు సంస్థలు, నిఘా వర్గాల కనుసన్నల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ విచారణలో రాష్ట్ర స్థాయిలోని దర్యాప్తు, నిఘా వర్గాలు సైతం పాల్గొంటున్నట్లు సమాచారం.

అత్యంత చాకచక్యంగా ఉగ్రవాదులను తమిళనాడు ఐబీ, అన్నమయ్య పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఉగ్రవాదుల నుంచి బాంబులు, పెద్దఎత్తున బాంబుల తయారీ పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. అదేవిధంగా ఉగ్రవాదుల భార్యలను సైతం అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. అంతటితో ఆగకుండా మూడు దశాబ్దాలకు పైగా రాయచోటిలో మకాం వేసిన ఉగ్రవాదుల గత చరిత్ర మొత్తం తవ్వే పనిలో పోలీసులు పడ్డారు. రాయచోటిలో ఉగ్రవాదులకు ఆవాసం కల్పించింది ఎవరు.. వారితో సన్నిహితంగా మెలిగింది ఎవరు. ఉగ్రవాదులు ఇద్దరికీ ఈ ప్రాంతంలో పెళ్లిచేసింది ఎవరు అనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే పట్టణంలోని పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదుపులోకి తీసుకున్న వారిని వేర్వేరు ప్రదేశాల్లో ఉంచి విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

విచారణ మొత్తం అబూబకర్ చుట్టే...

పోలీసులు అబూబకర్, మహ్మద్ అలీ అనే ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నప్పటికీ ప్రస్తుతం విచారణ మొత్తం అబూబకర్ చుట్టే తిరుగుతున్నట్లు తెలుస్తోంది. అబూబకర్ అరెస్టు తర్వాత అతడి ఇంట్లో పోలీసులు జరిపిన సోదాల్లో భారీ సంఖ్యలో బాంబు తయారీ పదార్థాలు దొరకడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన అబూబకర్ బాంబుల తయారీలో నిష్ణాతుడు.

1995లో తన నేర చరిత్రను మొదలుపెట్టిన అబూబకర్ దక్షిణాది రాష్ట్రాలలో పలుచోట్ల బాంబు పేలుళ్లకు పాల్పడ్డాడు. అక్కడ కొన్ని కేసుల్లో పోలీసులకు చిక్కినప్పటికీ బెయిల్ మీద బయటకు వచ్చి రాయచోటిలో స్థిరపడ్డాడు. గత 30 సంవత్సరాల్లో రాయచోటిలోని మూడు ప్రాంతాల్లో అతడు నివాసం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఇంటి ఓనర్లను, అతడికి ఇల్లు ఇప్పించిన వారిని విచారిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. 2021లో అతడికి పెళ్లి సంబంధాలు చూసి పెళ్లి చేసిన వారిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా మొహమ్మద్ అలీకి ఇక్కడ ఇల్లు ఇప్పించిన వారిని, పెళ్లి చేసిన వారిని కూడా పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాయచోటిలో ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ జరుగుతోంది.

అంతర్రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు

- రూ.81 లక్షల విలువ గల 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ వెంకటాద్రి



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్‌తో అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్ హెగ్డే, తదితరులు

రాయచోటిటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలం రాయవరం గ్రామం కావలిపల్లికు సమీపంలోని శేషాచలం అటవీ ప్రాంతంలో అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేయడంతో పాటు అతడి వద్ద నుంచి 81 లక్ష విలువ గల 26 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాయచోటి రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో అద నపు ఎస్పీ వెంకటాద్రి వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లా జమున మత్తూరు తాలూకా సారాం మందయ్య గ్రామానికి చెందిన ఆండి గోవిందన్ పదేళ్లుగా ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కావలిపల్లె అటవీ ప్రాంతం నుంచి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, రూరల్ సీఐ వరప్రసాద్, సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులతో పాటు టాస్క్‌ఫోర్స్ అధికారులు అటవీ ప్రాంతంలో కాపుకాసి ఆండి గోవిందన్‌ను శనివారం అరెస్టు చేసి 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇతడితో పాటు తమిళనాడుకు చెందిన మరికొందరు స్మగ్లర్లు తప్పించుకున్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్మగ్లర్ గోవిందన్‌పై ఉమ్మడి కడప జిల్లాలో మొత్తం 4 కేసులు నమోదయ్యాయన్నారు. అందులో 2017 సంవత్సరంలో ఖాజీపేట, దువ్వూరు, మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లతో పాటు 2024 సంవత్సరంలో సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదైందన్నారు. స్మగ్లర్‌ను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీసులను ఎస్పీ అభినందించినట్లు తెలిపారు. సమావేశంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్ హెగ్డే, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, రూరల్ సీఐ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వచ్చారు.. వెళ్లారు!



- జూనియర్ కళాశాలలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- వేధిస్తున్న పాముల బెడద
- అసాంఘిక చర్యలకు నిలయాలుగా భవనాలు
- ప్రతి ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

మంత్రి వచ్చి వెళ్లారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలు ఇకపై పరిష్కారం అవుతాయని భావించిన విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. మంత్రి వచ్చి వెళ్లి ఐదు నెలలు గడుస్తున్నా ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ములకలచెరువు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ములకల చెరువులోని జడ్పీ హైస్కూల్ భవనాల్లో 1994లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం కాగా, 1997-98 విద్యా సంవత్సరంలో ప్రభుత్వా స్పత్రి సమీపంలో నిర్మించిన భవనంలోకి తరగతి గదులను మార్చారు. అప్పట్లో నాలుగు తరగతి గదులే నిర్మించగా, 2009లో పనికి ఆహార పథకం కింద ఆఫీసు గదిని నిర్మించారు. ఆ తర్వాత కళాశాల అభివృద్ధిని గాలికి వదిలేశారు. కళాశాల ఉన్నది గుట్ట ప్రాంతం కావడంతో పాటు వెనుక భాగంలో ప్రహరీగోడ లేకపోవడంతో పా ముల బెడదతో విద్యార్థులు హడలెత్తిపోతున్నారు. తరగతి గదుల్లోకి పాములు వచ్చిన సంఘటనలు లేక పోలేదు. కళాశాల ప్రారంభ సమయంలో 27 ఏళ్లకు ముందు నిర్మించిన నాలుగు తరగతి గదు లు మాత్రమే ఉన్నాయి. తరువాత తరగతి గదులు నిర్మించలేదు. బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమెస్ట్రీ ల్యాబ్‌లు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. పాఠశాలలో ఇప్పటి వరకు కనీసం బోరు కూడా వేయకపోవడంతో గ్రామ పంచాయతీ కొళాయిల్లో వచ్చే నీరే దిక్కయింది. గత వైసీపీ హయాంలో నాడు - నేడు కింద ప్రారంభిం చిన మరుగుదొడ్ల పనులు అర్ధాంతరంగా ఆగిపోయా యి. ఈ కారణాలతో జూనియర్ కళాశాలలో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.


కూలిపోయిన ప్రహరీ గోడ


కళాశాల వెనుక వైపు పెరిగిన పిచ్చి మొక్కలు

మందుబాబులకు అడ్డా..

ప్రభుత్వ జూనియర్ కళాశాల మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రహరీ గోడ లేకపోవడం, దగ్గర లోనే మద్యం దుకాణం ఉండడంతో రాత్రి వేళల్లో మందుబాబులు కళాశాల భవనాలను వినియో గించుకుంటున్నారు. దీంతో ప్రతిరోజు ఉదయం కళాశాల ప్రాంగణంలో మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తాయి. దీనికితోడు మద్యం సీసాలు పగులగొట్టి వెళుతుండడంతో గాజు పెంకులు గుచ్చుకుని విద్యార్థులు గాయపడుతు న్నారు.

మంత్రి వచ్చినా.. పరిష్కారం కాలేదు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డితో కలిసి ఈ ఏడాది జనవరి 4న కళాశాలను సందర్శించారు. అప్పట్లో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలోని సమస్యలను పరిష్కరిం చాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఆయన హామీ ఇచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఐదేళ్లుగా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

విద్యా సంవత్సరం	ఫస్ట్ ఇయర్	సెకండ్ ఇయర్	మొత్తం
2021-22	155	166	321
2022-23	79	160	239
2023-24	54	94	148
2024-25	109	70	189
2025-26	70	102	172

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



జూనియర్ కళాశాలలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరిస్తామని చెప్పారు. ప్రహరీ గోడ లేకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నాం. అదనపు తరగతి గదులు, ల్యాబ్‌ల ఏర్పాటుకు గదులు కావాలి. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరాం.

- నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్

సమస్యలతో సతమతం



కళాశాలలో సమస్యలతో సత మతమవుతున్నాం. కనీసం తాగ డానికి మంచి నీరు కూడా లేవు. వాటర్ క్యాన్లను కొనుక్కుని తాగుతున్నాం. ప్రహరీ గోడ లేక పోవడంతో రక్షణ కరువైంది. పాములు తరగతి గదుల్లోకి వస్తున్నాయి. కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

-మానస, విద్యార్థిని

సచివాలయ ఉద్యోగుల బదిలీలు షురూ

- సోమవారం నుంచి ఉత్తర్వుల జారీ

కలికిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన గడువు శనివారంతో ముగి సింది. సచివాలయాల్లో వివిధ కేటగిరీల్లోని పోస్టులను హేతుబ ద్ధంగా సర్దుబాటు చేస్తూ, జూన్ 30 లోగా పూర్తి చేయాలని జూన్ 12న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ ముగిసి, బదిలీ లకు అర్హతగలిగిన వారందరికీ గత వారం కౌన్సెలింగ్ కూడా పూర్తి చేసింది. కొన్ని జిల్లాల్లో కౌన్సెలింగ్ ముగిసిన అనంతరం బదిలీ ఉత్త ర్వులు మాత్రం జారీ చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. జూలై 1 నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉండడంతో సచివా లయాల శాఖ డైరెక్టరు జూన్ 26న జిల్లా కలెక్టర్లకు ఒక సర్క్యూలర్ జారీ చేశారు. కౌన్సెలింగ్ మాత్రం గడువులోగా పూర్తి చేసి బదిలీలు, పోస్టింగ్ ఉత్తర్వులను జారీ చేయకుండా సూచనలిచ్చారు. ఈ కార ణంగా కౌన్సెలింగ్ పూర్తయినా సచివాలయ ఉద్యోగులకు బదిలీ ఉత్త ర్వులు జారీ చేయలేదు. బదిలీ ఉత్తర్వులు జారీ చేసే గడువును ఈ నెల 5 వరకూ పొడిగించాలని సచివాలయ శాఖ డైరెక్టరు ప్రభు త్వాన్ని కోరారు. పరిశీలించిన ప్రభుత్వం శనివారం వరకూ బదిలీ ఉత్తర్వులు జారీ చేయవచ్చంటూ గ్రామ వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం


ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకానికి రైతులు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం తెలిపారు. శనివారం మండలంలో బండపల్లి గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. రైతులు తమ పొలాల వద్ద ఫారంపాండ్ ఏ ర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ కార్య క్రమంలో ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబు లేసు, టీఏ కళావతి, ఫీల్డ్ అసిస్టెంట్లు సురేంద్ర పాల్గొన్నారు.

కోదండరామాలయానికి ఎన్నారై విరాళం


విరాళంఅందజేస్తున్న శశిభూషణ్‌రాజు

సంబేపల్లె, జూలై5(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె గ్రామం అంబేద్కర్‌నగర్‌లో నిర్మిస్తున్న కోదండ రామాలయానికి ఎన్నారై శశిభూషణ్ రాజు శనివారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శశిభూషణ్‌రాజు దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్నారై మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలతో ప్రజల్లో భక్తిభావం పెంపొందుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆలయాల నిర్మాణాలను ప్రభుత్వం చొరవతో పాటు దాతల సహకారంతో ఆలయాలు నిర్మించడం గొప్ప విశేషమ న్నారు. మాజీ సర్పంచ్ గోపాల్, సుబ్బరాజు, రెడ్డెన్న, రామచంద్ర తది తరులు పాల్గొన్నారు.

కమనీయం నరసింహస్వామి కల్యాణం


నరసింహస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని వేదపండితులు శనివారం శ్రీదేవి, భూదేవిలతో కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో ప్రతి నెలా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్స వమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా చేశారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్ర మంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, వరద, ఆలయ సిబ్బంది నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండ

- తప్పుడు ప్రచారంతో వైసీపీ పైశాచిక ఆనందం
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడి రైతులు నష్టపోకుండా ఫ్యాక్టరీలు కిలో రూ.8తో కొంటుండగా ప్రభుత్వం అదనంగా కిలోకు రూ.4లు ఇస్తోందన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మామిడి దిగుబడి భారీగా పెరిగిందన్నారు. దీంతో ప్రభుత్వం ముందుగా అప్రమత్తమై రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో సబ్సిడీ ఇస్తోందన్నారు. ప్రభుత్వం కిలో రూ.8తో కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్‌ఆర్ ఫుడ్స్ రైతుల నుంచి కిలో రూ.3కే కొనుగోలు చేస్తోందన్నారు. నష్టాల్లో ఉన్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంటే తప్పుడు ప్రచారం చేస్తూ వైసీపీ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. కష్ట సమయాల్లో కిలో రూ.4 సబ్సిడీ ఇచ్చి ఆదుకుంటున్న ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసేందుకే జగన్‌రెడ్డి రైతులపై దండయాత్రకు బయలుదేరాడన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో భారీగా కేసుల పరిష్కారం


రాయచోటి కోర్టులో కేసులను విచారిస్తున్న జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి


రాజంపేటలో బాధిత కక్షిదారుకు పరిహారం అందజేస్తున్న న్యాయాధికారులు

రాయచోటిటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాయచోటి, రాజంపేట కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కారమయ్యాయి. రాయచోటి కోర్టులో జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తేజస్విని 906 కేసులను పరిష్కరించారు. రోడ్డు ప్రమాదాల కేసుల్లో రూ.1,93,77,873ల నష్ట పరిహారం బాధితు లకు చెల్లించారు. న్యాయవాదులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట కోర్టులో 204 క్రిమినల్ కేసులు, ఆరు సివిల్ కేసులు పరిష్కారం కాగా, కక్షిదారుల నుంచి 62,24,466 రూపాయలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా అదనపు జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దంపతులకు సంబంధించిన ఓ కేసులో 20 లక్షల రూపాయలతో రాజీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్‌జడ్జి సి.రాజన్‌ఉదయప్రకాష్, పీపీటీ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, జి.రామచంద్రయ్య తదిత రులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నికల్లో వాగ్వాదం

- దూషించుకున్న తెలుగు తమ్ముళ్లు


శ్రీనివాసులునాయుడుతో వాగ్వాదం చేస్తున్న గొల్లపల్లి టీడీపీ నేతలు

రామసముద్రం జూలై 5(ఆంధ్రజ్యోతి):ఏకపక్ష నిర్ణయాలు తీసుకుం టున్నారంటూ కొందరు టీడీపీ నాయకులు ఎన్నికల పరిశీలకులతో వాగ్వాదానికి దిగడంతో గ్రామ కమిటీ ఎన్నికల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రామసముద్రం మండలంలోని అరికెల, మానేవారిపల్లె, మాలేనత్తం, కేసీపల్లె, మూగవాడి, చొక్కాండ్లపల్లె, మినికి, రాగిమాకు లపల్లె, ఊలపాడు పంచాయతీలకు సంబంధించి శనివారం పరిశీ లకుడు శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. మొదట అరికెల పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి నలుగురు పోటీ పడ్డారు. అయితే, హనుమం తురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పరిశీలకుడు శ్రీనివాసులునాయుడు ప్రకటించారు. భోజనం అనంతరం మూగవాడి పంచాయతీ ఎన్నిక జరగాల్సి ఉండగా, తమకు తెలియకుండా ఓ వర్గానికి చెందిన వ్యక్తిని గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఎంపిక చేస్తూ పరిశీలకుడు ఏక పక్ష నిర్ణయం తీసుకున్నారని మరో వర్గానికి చెందిన శ్రీనివాసులు నిలదీశారు. దీనితో ఆ నిర్ణయాన్ని విరమించుకుని ఆశావహుల పేర్లను నమోదు చేసుకున్నారు. మినికి పంచాయతీలో కూడా టీడీపీ నేతలు పోటీ పడ్డారు. రాగిమాకులపల్లెకు సుబ్రహ్మణ్యం, ఊలపా డుకు వెంకటాచలపతి, చొక్కాండ్లపల్లె రెడ్డెప్పరెడ్డి ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. ఇదిలా ఉండగా గ్రామ కమిటీ అధ్యక్షుల ఎంపిక ఎన్నికలలో మండల టీడీపీ నాయకుల మధ్య ఉన్న వర్గపోరు మరోమారు బయటపడింది. కార్యకర్తలు, అభిమానులు విభేదాలు వీడి పార్టీకి అంకిత భావంతో పనిచేస్తుంటే కొందరు నాయకులు పార్టీని తమ స్వలాభం కోసం వాడుకుంటున్నారని, ఇది ఇలాగే కొనసాగితే రాబోయే స్థానిక ఎన్నికలలో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని, ఇప్పటికైనా పరిశీలకులు మండల పరిస్థితిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి వర్గపోరుకు బ్రేకులు వేయాలని టీడీపీ కార్యకర్తలు, అభిమానులు కోరుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పది మందికి గాయాలు


కురబలకోట: సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


సంబేపల్లె: కాలు విరగడంతో కూర్చుండిపోయిన ఆటో డ్రైవర్ జాన్

కురబలకోట, జూలై 5(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పది మంది గాయపడగా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది వివరాలిలా.. పెద్దమండ్యం మండలం ముసలికుంటకు చెందిన రైతులు బొలెరో వాహనంలో అంగళ్ల గొర్రెల సంతనుంచి స్వగ్రామానికి వస్తూ కురబలకోట రైల్వేగేటు సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. దీంతో వాహనం బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న పెద్దమండ్యం మండలం ముసలికుంట పంచాయతీ దట్టేనాయక్ తాండాకు చెందిన కృష్ణానాయక్(60), ఆయన కుమారుడు బాలాజీ నాయక్(30), బండ్రేవుకు చెందిన లక్ష్మయ్య(50), ముసలికుంటకు చెందిన మల్‌రెడ్డి (45), రామాంజనేయరెడ్డి (28), ద్విచక్రవాహనదారుడు గాలివీడు మండలం బలిజపల్లెకు చెందిన మహేష్(32) గాయపడ్డారు. మ హేష్ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. క్షత గాత్రులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వా సుపత్రికి తరలించారు. బాలాజీనాయక్, కృష్ణానాయక్, మహేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించారు. ముది వేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి ర్యాప్తు చేస్తున్నారు.

సంబేపల్లె : ఆటోను కారు ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. శెట్టిపల్లె గ్రామం సదిపిరివాండ్లపల్లెకు చెందిన జయనారాయణరెడ్డి హరిజనవాడకు చెందిన రమేశ్ అతని భార్య అలివేలు, కోడలు రెడ్డె మ్మతో కలిసి కారులో రాయచోటికి వస్తుండగా పీఎస్‌కాలనీ సమీపం లో డ్రిప్, ఎరువుల లోడ్‌తో వెళుతున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమా దంలో అలివేలమ్మ, ఆటో డ్రైవర్ జాన్‌కు కాలు విరిగింది. రెడ్డెమ్మ, జయనారాయణరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలియజేశారు.

వినాయకుడి విగ్రహం అపహరణ కేసులో 13 మంది అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి

పెనగలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వినాయకుడి విగ్రహం అపహరణ కేసులో 13 మందిని అరెస్టు చేసినట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ తెలిపారు. శనివారం పెనగలూరు పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిం చారు. గత నెల 24 తెల్లవారుజామున అత్తిగారిపల్లె బీసీ కాలనీ సమీపంలోని వినాయకుడి రాతి విగ్రహం అపహరణకు గురైంది. ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ముద్రపల్లె క్రాస్‌రోడ్డులో అను మానాస్పదంగా తిరుగుతున్న 13 మందిని అరెస్ట్ చేసి, విచారణ చేయగా, వారంతా వినాయకుని విగ్రహం అపహరణ కేసులో నింది తులుగా తేలింది. వారంతా పికొత్తపల్లె, ఈటమాపురం, మనుబోలు, చింతకాయలపల్లి, కొందరు తమిళులుగా గుర్తించారు. ఈ 13 మంది ముఠాగా ఏర్పడి విగ్రహాన్ని ఓదేటివారిపల్లె క్రాస్‌రోడ్డు వరకు ఈడ్చు కుని పోయి, అక్కడి నుంచి ట్రాక్టర్లో ఈటమాపురం చెరువులోనికి తీసుకెళ్లారు. అక్కడ విగ్రహాన్ని పగులగొట్టి చూడగా, అందులో ఎలాంటి విలువైన వస్తువులు లభించలేదని తేలింది. ఈ కేసులో ముగ్గురు మహిళలతో పాటు పది మంది పురుషులను అరెస్ట్ చేసి నట్లు సీఐ తెలిపారు. ఈ కేసు ఛేదించిన పెనగలూరు ఎస్ఐ రవిప్ర కాష్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాయుడు, రవిశంకర్‌న ఆయన అభి నందించారు. సాంకేతికపరంగా వీరికి సహకరించిన స్టేషన్ సిబ్బందిని అభినందిస్తూ, రివార్డుల కోసం ఎస్పీకి సిఫారసు చేస్తున్నట్లు తెలి పారు. నిందితులు పగులగొట్టిన విగ్రహం రాతి ముక్కలు, ఒక ఇన్నోవా కారు నాలుగు మోటార్‌బైకులు ఒక ట్రాక్టర్, సమ్మెట, క్షుద్ర పూజలు కోసం ఉపయోగించిన నిమ్మకాయలు, పసుపు, కుంకుమ లను సీజ్ చేసినట్లు వివరించారు

గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి విక్రేతతో సిద్దవటం పోలీసులు

సిద్దవటం, జూలై5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్ర యిస్తున్న ఓ వ్యక్తిని శని వారం సిద్దవటం పోలీసు లు అరెస్టు చేశారు. ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపిన వివరాల మేరకు.. కడప నగరానికి చెందిన రెడ్డి నరేశ్ అనే వ్యక్తి మండలంలోని భాకరాపేటలో గంజాయి విక్రయి స్తున్నట్లు సమాచారం అందడంతో దాడు లు నిర్వహించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 1200 గ్రాముల గంజాయి స్వాధీ నం చేసుకున్నామన్నారు. వైజాగ్ జిల్లా చింతపల్లి గ్రామం నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి కడప నగరంలో అధిక ధర కు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మరి కొంతమందిని విచారణ చేయాల్సి ఉందన్నా రు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.20 వేలు ఉంటుందని వివరిం చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని సిద్దవటం జూని యర్ సివిల్‌జడ్జి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్‌రఫీ, హెడ్‌కాని స్టేబుల్ కొండయ్య, రైటర్ రాముడు, కానిస్టేబుల్ రాఘవ పాల్గొన్నారు.

ముగ్గురిపై దాడి కేసు నమోదు

కలకడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళ్లపల్లె పంచాయతీ బొజ్జగుంటపల్లె వడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులపై దాడి చేసిన ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు శ్రీనివాసులు అదే గ్రామంలోని రామాలయం వద్ద కూర్చుని సెల్‌ఫోన్ చూస్తుండగా అక్కడికి వచ్చిన రెడ్డిప్రసాద్, భార్య సౌజన్య, మరదలు సురేఖ తమను ఫోటో తీశాడంటూ శ్రీనివాసులు, అతని కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెచ్‌సీ తెలిపారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు


కుక్కల దాడిలో గాయపడిన జింక

తంబళ్లపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడికి గురైన జింకను ఓ వ్యక్తి కాపాడాడు. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన మల్లికార్జునరెడ్డి శుక్రవారం రాత్రి తోటలో పనులు చూసుకుని ఇంటికి వెళ్తుండగా కుక్క లు జింకపై దాడి చేస్తుండడం కనిపించింది. దీంతో ఆయన కుక్కలను చెదరగొట్టి జింకను కాపాడి తన తోటలోని షెడ్డు వద్దకు చేర్చాడు. అటవీ సిబ్బంది, పశువైద్యులకు సమాచారం ఇచ్చాడు. శనివారం తెల్లవారుజామునే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామరాజు, పశు వైద్యురాలు ఇందు తోట వద్దకు చేరుకుని గాయపడిన జింకకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం అవసరమవ్వడంతో మదనపల్లె పశువైద్యశాలకు తరలించారు.

యువకుడి ఆత్మహత్య


మస్తాన్ మృతదేహం

పీలేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): యమహా షోరూములో మెకానిక్‌గా పనిచేస్తున్న మస్తాన్(30) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మస్తాన్, శనివారం సాయంత్రం ఇంటిలోని తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఆ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని పీలేరు ప్రభు త్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిరా రించారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. పీలేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమిత ప్రభుత్వ స్థలం స్వాధీనం


అధికారులు కూల్చివేసిన అక్రమ కట్టడం

కురబలకోట,జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆక్ర మణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికా రులు స్వాధీనం చేసుకు న్నట్లు తహసీల్దార్ ధ నంజయులు తెలిపారు. మండలంలోని చింత మాకులపల్లె వాసి ఎస్. బాబురెడ్డి సర్వేనంబర్ 817లో గ్రామ చెరువులోని 15 సెంట్ల భూమి ని ఆక్రమించుకుని రేకుల షెడ్డును నిర్మించుకున్నాడు. దీనిపై అధికా రులు స్పందించి ఆక్రమ కట్టడాలను కూల్చి భూమి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషాద్రి, పాల్గొన్నారు.

రేపు నిత్యపూజేశ్వర హుండీ లెక్కింపు

సిద్దవటం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర దేవ స్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం జూలై 7న ఉదయం 10 గంట లకు నిత్యపూజేశ్వరస్వామి ఆలయంలో జరుగుతుందని ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్, పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కడప క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు కేజీల 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కడప చిన్నచౌకు ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐలు విశ్వనాథరెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లెకు చెందిన కడియాల పవన్‌కుమార్ బీటెక్ మధ్యలో వదిలేశాడు. అదే గ్రామానికి చెందిన మోటుపల్లి సతీష్‌చంద్ర డిగ్రీ రెండో సంవత్సరం చదువు సాగించారు. వీరు స్నేహితులుగా ఉంటూ చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు కడపలోని నందిమండలం గణేశ్, కడపకు చెందిన ప్రింటర్ చల్లా వినోద్, నారాయోగేషులు బద్వేలుకు చెందిన చిన్నన్నం నాగేంద్ర ద్వారా గంజాయి తెప్పించుకుని వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. శనివారం ఉదయం సమాచారం రావడంతో సీకే దిన్నె మండలం ఊటుకూరు వద్ద ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో కలిసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి కేజీ 25 గ్రాములు కలిగిన ఆరు ప్యాకెట్లు గంజాయి, బైకు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసకున్నట్లు తెలిపారు. అలాగే మరో కేసులో అప్సర సర్కిల్ వద్ద కడపకు చెందిన షేక్ గుడు సబ్‌వలి, కొత్తపేటకు చెందిన గోపిరెడ్డి మునీష్ కుమార్ రెడ్డి గంజయి విక్రయంచేందుకు సిద్దంగా ఉన్నట్లు సమా చారం రావడంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి సిబ్బందితో అరెస్టు చేసి, కేజీ 100 గ్రాములు కలిగిన గంజాయి , రెండు బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు



హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఎర్రగుంట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఈ నెల 1వ తేదీ జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన షేక్షావల్లికి హసీనా అనే చెల్లెలు ఉంది. ఆమెకు భర్త చనిపోయి 15 సంవత్సరాలు అయ్యింది. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరు ఆర్ట్స్ కాలేజి రోడ్డు గురువయ్య తోటకు చెందిన షేక్ జాఫర్ వల్లితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. జూన్ 27వ తేదీ హసీనాను కడపలోని ఆమె తల్లివద్ద జాఫర్ వదిలి వెళ్లాడు. 30వ తేదీ హసీనాను పిల్చుకుని వెళ్లేందుకు అక్కడికి వెళ్లగా ఆమె అన్న షేక్షావల్లి చూసి తన చెల్లెలి జోలికి ఇకపై రావద్దని మందలించాడు. దీంతో తనకు హసీనాకు మధ్యలో అడ్డుగా ఉన్న షేక్షావల్లిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు. జూలై 1న కడపకు వెళ్లి షేక్షావల్లిని మద్యం తాగుదామని పిలిచాడు. ఇందుకు ఆయన అంగీకరించడంతో ఎర్రగుంట్లకు వెళ్లి కుక్కలు పడదామని.. ఆ వచ్చిన డబ్బుతో మద్యం తాపుతానని ఆయన నమ్మించాడు. అతని మాటలు నమ్మి జాఫర్ వెంట ఎర్రగుంట్లకు వచ్చాడు. అదే రోజు సాయంత్రం మద్యం తాగేందుకు ఎర్రగుంట్ల మార్కెట్ యార్డుకు వెళ్లారు. ఎలాగైనా షేక్షావల్లిని చంపాలనుకున్న జాఫర్ గోదాం వెనుకకు తీసుకెళ్లి అతిగా మద్యం తాపించాడు. మద్యం మత్తులో ఉన్న షేక్షావల్లిని బండరాయితో తలపై కొట్టి చంపాడు. అనంతరం జాఫర్ అక్కడి నుంచి పరరాయ్యాడు. షెక్షావల్లి తమ్ముడు సయ్యద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎర్రగుంట్ల పోలీసులు హత్య కేసు మిస్టరీని ఛేదించి నిందితుడు జాఫర్‌ను అరెస్టు చేశా రు. కార్యక్రమంలో సీఐ నరేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన బాలాజీ

కమలాపురం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కడప- తాడిపత్రి జాతీయ రహదారి టి.చదిపిరాళ్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో జాన బాలాజీ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థాని కులు, పోలీసుల సమాచారం మేరకు కమలాపురం పట్టణానికి చెందిన బాలాజీ భారతి సిమెంటు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యా హ్నం డ్యూటీకి వెళ్లారు. మరుసటి రోజు శనివారం తెల్లవారు జామున డ్యూటీ ముగించుకుని ఇంటికి బయల్దేరారు. చదిపిరాళ్ల గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆల్విన్‌వాహనం స్కూటరును ఢీకొంది. దీంతో బాలాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని విగత జీవిగా పడి ఉన్న బాలాజీని చూసి కన్నీరు మున్నీరుగా విలపించా రు. మృతునికి భార్య శృతి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

చస్తే.. చావే..!

- ఆరడుగుల జాగా కోసం ఆలంఖాన్‌పల్లె శ్మశానంలో అవస్థలు
- మురుగునీటితో చెరువులా శ్మశానం



ఆలంఖాన్‌పల్లె శ్మశాన వాటికలో మురుగు నీటిలో తేలుతున్నట్లు కనిపిస్తున్న సమాధులు



శ్మశాన వాటికలోని కావ్రేడ్ల స్తూపాల వద్ద మురుగునీరు

కడప మారుతీనగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): చనిపోయిన వారిని సమాధుల వద్దకు వెళ్లి నివాళి అర్పించి స్మరించుకునే సంప్రదాయం అన్ని మతాల్లోనూ ఉంది. హిందువులు ఉగాది, సంక్రాంతి పండుగల సమయంలో తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి టెంకాయలు కొట్టి వారిని స్మరించుకుని వస్తుంటారు. అయితే.. ఆలంఖాన్‌పల్లె వాసులకు మాత్రం ఇది సాధ్యం కావడం లేదు. ఎందుకంటే ఇక్కడి శ్మశానం దశాబ్దాలుగా మురుగునీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది.

కడప నగరంలోని 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో ఐదువేలకు పైగా జనాభా ఉన్నారు. అయితే వీరికి సరైన శ్మశాన వాటిక లేదు. ఉన్న శ్మశానంలో మురుగునీరు నిల్వ ఉంది. మామూలు రోజుల్లోనే ఆ శ్మశానంలో శవాన్ని పూడ్చాలంటే అగ్నిపరీక్షే. అలాంటిది వర్షాకాలంలో మరీ నరకయాతన తప్పదు. పాలకులు, అధికారులు మారుతున్నారే గానీ ఆలంఖాన్‌పల్లె శ్మశానవాటిక దుస్థితిలో ఎలాంటి మార్పురాలేదు. కాలం గడిచే కొద్దీ ఆ శ్మశానంలో శవాన్ని పూడ్చలేని దశకు చేరుకుంది. ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ నాయకులు శ్మశానం అభివృద్ధి చేయిస్తామని చెబుతున్నారే కానీ తర్వాత పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులకు, కార్పొరేషన్ కమిషర్‌కు శ్మశానవాటిక దుస్థితిపై పలుమార్లు తెలిపినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్.మాధవి అయినా ఆలంఖాన్ పల్లె శ్మశానాన్ని పట్టించుకోవాలని వారు కోరుతున్నారు.

నూతన బోధన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

వేంపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతిక విద్యలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఎప్పటికప్పుడు నూతన బోధనా పద్ధతులపై అవగాహన పెంచుకొని విద్యార్థులకు బోధించాలని జలంధర్ నిట్ మెకానికల్ హెచ్‌ఓడీ, ప్రొఫెసర్ శ్రీనివాస్ సూచించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో బోధనా సిబ్బందికి ఫలిత ఆధారిత విద్య అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ శుక్ర, శనివారాల్లో జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక విద్యలో ఓబీఈ ప్రాముఖ్యత, పాఠ్యాంశాల రూపకల్పన, మూల్యాంకనంపై అవగాహన కల్పించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, వర్క్‌షాప్ ప్రతినిధులు కోటేశ్వరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి

జమ్మలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అగ్రికల్చరల్, హౌసింగ్, చేనేత, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ , మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించిన అభివృద్ధితో పాటు బంగారు కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై చర్చించారు. విజన్ ప్లానింగ్‌లో భాగంగా 2029 నాటికి బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఇందుకు అధికారులు అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

ఆప్కో చేనేత అమ్మకాలపై డిస్కౌంట్

కడప మారుతీనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం సందర్భంగా ఆప్కోవారు చేనేత వస్త్రాల అమ్మకాలపై 30 శాతం నుంచి 50శాతం డిస్కౌంటు ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి కోటేశ్వర్‌రావు వెల్లడించారు. ఆ మేరకు కడప నగర వన్‌టౌన్ సమీప క్లాక్ టవర్ పక్కనే గల ఆప్కో మెగా షోరూంలో, కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆప్కో విక్రయశాలలో, పులివెందులలోని జయమ్మ మున్సిపల్ కాంప్లెక్స్‌లో, రాయచోటి బస్టాండు వద్ద, కోడూరు, చిట్వేలి రోడ్డు, రాజంపేట పాతబస్టాండు వద్ద గల ఆప్కో షోరూంలలో ఈ డిస్కౌంటు సేల్స్ అవకాశం కలదన్నారు. ఇందులో అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 35 శాతం నుంచి 50 శాతం వరకు డిస్కౌంటు ఉందన్నారు. ముఖ్యంగా ఆప్కోలో మంగళగిరి, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, వెంకటగిరి, మాధవరం, చీరాల, కాటన్, పట్టు చీరలు, డ్రెస్ మెటీరియల్స్, రెడిమేడ్ షర్ట్స్, దుప్పట్లు, దోవతులు, లుంగీలు, టవల్స్ తదితర అన్నిరకాలపై 30 శాతం డిస్కౌంటు కలదన్నారు. రానున్న సెలవు దినాల్లో కూడా ఆప్కో షోరూంలు తెరిచి ఉంటాయన్నారు.

గర్భిణీ మృతిపై త్రీమెన్ కమిటీ విచారణ

బద్వేలు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన గర్భిణీ గత నెల 29న వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన వార్త కథనాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు నియమించిన త్రీమెన్ కమిటీ శనివారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచారణ చేపట్టారు. ఈ కమిటీలోని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్రీయ బాలుర సురక్ష కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లేశ్‌లు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు హెల్త్ ఆఫీసరు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్, ప్రైవేటు హాస్పిటల్ డాక్టర్లను విచారించారు. మరణానికి సంబంధించిన అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో తొట్టిగారిపల్లె ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపంటెండెంట్, వైద్యాధికారులు, కమ్యూనిటీ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలతల భూములకు వేలం

పెండ్లిమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం భూములకు ఈనెల 9న బుధవారం దేవస్థానంలో అధికా రుల సమక్షంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గంగనపల్లె, తిప్పిరెడ్డిపల్లె, కొత్తగిరియంపల్లె రెవెన్యూ గ్రామాల పరధిలో 23 ఎకరాలకు బహిరంగ వేలంలో హెచ్చు పాటదారునికి మూడేళ్ల కాలానికి కౌలుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. పాటదారుడు ప్రతి సంవత్సరం మార్చి నెలాఖరు లోపు మునుగుత్త చెల్లించి భూమిలోకి దిగాలన్నారు.

ఆరుగురికి తిరుపతి స్విమ్స్‌లో వైద్యపరీక్షలు

పులివెందుల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జెండాలు తొలగించిన సమయంలో నమోదైన కేసులో ఉన్న ఆరుగురికి మరోసారి తిరుపతి స్విమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించారు. శనివారం ఈ వైద్యపరీక్షల కోసం సీఐ చాంద్‌బాష ఆధ్వర్యంలో ఆరుగురిని పార్నపల్లె కిషోర్, సాతుపాటి రాజేష్, కావేటి మల్లికార్జున, షేక్ మస్తాన్, పార్నపల్లె వెంకటచలపతి, సాతుపాటి వెంకటపతిలను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. మే నెలలో జరిగిన టీడీపీ మహానాడు సందర్భంగా పులివెందులలో కట్టిన జెండాలను తొలగించి అడ్డుపడిన వ్యక్తిని మారణాయుధాలతో చంపేందుకు ప్రయత్నించారని హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ సమయంలో పోలీసులు మమ్మల్ని కొట్టారని ఈ కేసులో ఉన్న ఆరుగురు కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో మొదట జమ్మలమడుగు కోర్టు పులివెందుల ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించాలని ఆదేశాలు జారీ చేసింది. అక్కడ సరిగా చేయలేదని హైకోర్టును ఆశ్రయించడంతో జూన్ 18 కర్నూలు వైద్యశాలలో పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడవారికి 20న వైద్య పరీక్షలు నిర్వహించినా సరిగా చేయలేదని మరోమారు హైకోర్టును ఆశ్రయించడంతో తిరుపతి స్విమ్స్‌లో నిర్వహించాలని జూన్ 30 తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. వారం రోజుల లోపు వైద్యపరీక్షలు నిర్వహించి సంబంధించిన రిపోర్టును కోర్టుకు సమర్పించాలని కోరింది. దీంతో అర్బన్ సీఐ చాంద్‌బాష శనివారం తిరుపతి స్విమ్‌లో వైద్యపరీక్షలకు తీసుకెళ్లారు.

వాతావరణానికి అనువైన పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి

సీకేదిన్నె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతులు వాతావరణానికి అనువైన పంటలు సాగు చేసే విధంగా అవగాహన కలిగించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శనివారం కడప, అన్నమయ్య జిల్లాల్లోని వ్యవసాయ ఉప సంచాలకులకు శిక్షణ, సందర్శన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షాభావ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయడం మంచిదన్నారు. జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ వ్యవసాయాధికారులు తగిన సలహాలు, సూచనలు అందించి... రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసి నష్టపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త వీరయ్య, శాస్త్రవేత్తలు మాధురి, శ్రీవల్లి, భాగవతప్రియ, ఆక్వా పీడీ విజయలక్ష్మి, రెండు జిల్లాల ఏడీఏలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

దువ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబాకరాపురం గ్రామానికి చెందిన సుచరిత (19) అనే యువతి శుక్రవారం రాత్రి నుంచి కనిపించడం లేదు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఈమె ఇంటి వద్ద ఖాళీగా ఉండేది. ఉన్నఫలంగా కనిపించకపోవడంతో తండ్రి జొన్నవరం ఓబులేసు శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

జమ్మలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు వద్ద పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. పట్టుబడిన ఇసుక లారీలను ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఉంచామన్నారు. కాగా, జమ్మలమడుగు నుంచి అన్ని ప్రాంతాలవైపు ఇసుక తరలిపోతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

'జగన్ పట్టించుకోడు...కూటమికి పట్టదు'



రోడ్డు పనులు పెండింగ్‌లో ఉంచడంపై నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

వేంపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో నిలిచిపోయిన రోడ్డు పనుల గురించి పులివెందుల ఎమ్మెల్యే జగన్ పట్టించుకోడు... కూటమికి ఏమాత్రం పట్టడం లేదని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మండిపడ్డారు. వేంపల్లెలో కోట్లాది రూపాయలతో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులు నిలిపివేశారు. ఇప్పటి వరకు పునఃప్రారంభంకాలేదు. శనివారం పట్టణంలోని ఆయా రోడ్లను పరిశీలించిన తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నిరసనగా టెంకాయమొక్క నాటారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లుతెరిచి రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, మండలశాఖ అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వెనకంజలో కర్నూలు, ఆధిక్యంలో నెల్లూరు జట్టు



వీరారెడ్డి (అనంతపురం) మహిత్ (కర్నూలు) భార్గవ మహేశ్ (నెల్లూరు)

కడప స్పోర్ట్స్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీ డే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా రెండో రోజు శనివారం కర్నూలు జట్టు 158 పరుగుల వెనకంజలో ఎదురీదుతోంది. అలాగే మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు చిత్తూరుపై 83 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా...

కేవోఆర్ఎం మైదానంలో కర్నూలు - అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో ఓవర్ నైట్ స్కోరు 135 పరుగులతో బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 82.2 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 486 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో వీరారెడ్డి 251 పరుగులు, జయంత్‌క్రిష్ణ 79, సందీప్‌రెడ్డి 55 పరుగులు చేయడంతో జట్టు భా రీ స్కోరు చేసింది. బౌలింగ్ విభాగంలో మహిత్ 5 వికెట్లు పడగొ ట్టాడు. దీంతో అనంత పురం జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 273 పరుగులు ఆధిక్యత లభిం చింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరు గులు చేసింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 69 పరుగులు చేశారు. దీంతో కర్నూలు జట్టు మరో 158 పరుగుల లోటుతో ఎదురీదుతోంది.

ఏసీఏ మైదానంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రెండో రోజు శనివారం 14 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 61.1 ఓవర్లలో 318 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సిద్దు 74 పరుగులు, వరుణ్ 64 పరుగులు, సాయిచరణ్ 60 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో భార్గవమహేశ్ 5 వికెట్లు సాధించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో 63 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయింది. ఇందులో కారుణ్య ప్రసాద్ 47 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

పెన్షనర్లకు షాక్.. వెనక్కి వెళ్లిన స్పౌజ్ పెన్షన్ల డబ్బు

ప్రొద్దుటూరు ,జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో జూలై నెలలో స్పౌజ్ కేసు కింద మంజూరైన 144 పెన్షన్ల డబ్బు వెనక్కి వెళ్లింది. దీంతో పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న భర్త కోల్పోయిన వితంతువులు, భార్య కోల్పోయిన భర్తలు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు భర్త చనిపోతే అతనికి వచ్చే పెన్షన్‌ను వెంటనే భార్యకు అందజేసేలా అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోకుండా ఆటోమెటిక్‌గా భర్త డెత్ సర్టిఫికేట్ పెట్టగానే భార్యకు ఫించను డబ్బు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలీటీలో 144 మందికి స్పౌజ్ కింద పెన్షన్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి డబ్బు కూడా బ్యాంకులో జమ అయ్యింది. కానీ అనుకోకుండా జిల్లా డీఆర్‌డీఏ అధికారులు ఆ డబ్బును వెనక్కి పంపాలని ఆదేశించారు. కారణం తెలియకుండా మంజూరై వచ్చిన ఫించను ఈ నెల పొందుతామనుకునే లోపు తిరిగి వెనక్కి పోవడంపై పెన్షన్ దారులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే జరిగిన లోపాలను సరిదిద్ది మంజూరైన స్పౌజ్ పెన్షన్లు ఇచ్చేల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై కమిషనర్ రవిచంద్రారెడ్డిని వివరణ కోరగా డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడి పెన్షన్ దారులకు పంపిణీ జరిగేలలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా

● పెన్నాలో అడుగంటుతున్న భూగర్భజలాలు



సిద్దవటం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిని ఇసుకాశురులు తోడేస్తున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు లేకున్నా గృహావసరాల సాకుతో ఇసుక బయట ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సిద్దవటం మండలం ఆనుకుని పెన్నానది ప్రవహిస్తుంది. నదిలో ఇసుక పుష్కలంగా లభిస్తుంది. గత వైసీపీ పాలనలో కూడా ఇసుక మాఫియా పేట్రేగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని షరతులతో ఇసుక తరలింపునకు అనుమతులు ఇచ్చారు. గృహనిర్మాణాలకు వసరమయ్యే ఇసుక కోసం తహసీల్దారు కార్యాలయంలో అనుమతులు తీసుకుని పెన్నానది నుంచి ఇసుక ఉచితంగా ట్రాక్టర్ ద్వారా తీసుకుని పోవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. సిద్దవటం మండలంలో గుండ్లమాల, డేగనవారిపల్లె, మాచుపల్లె, టక్కోలి గ్రామాలను ఆనుకుని పెన్నానది నుంచి ఇసుక తరింపునకు ఎటువంటి అనుమతులు లేకున్నా ప్రతిరోజు ట్రాక్టర్ల ద్వారా కడపకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు ఇసుక ధర రూ.4 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ రవాణాను అరికట్టడంలో అధికారులు చోద్యం చూస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. పగలూరాత్రి తేడా లేకుండా ఇసుకను పెన్నానది నుంచి తోడేస్తున్నారు.



పెన్నా నదిలోని ఇసుకను అధిక లోతులోకి తోడేసిన దృశ్యం

అడుగంటుతున్న భూగర్భజలాలు పెన్నానదిలో అధిక లోతులోకి ఇసుక తవ్వకాలు చేపట్టడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నిత్యం అక్రమంగా ఇసుకను తరలించి కాసులు పోగేసుకుంటున్నా నియంత్రణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ఇసుక మాఫియాను అరికట్టాలని వారు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం



పెన్నా నదిలో ఇసుక అక్రమంగా తరలిపోకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. మండలంలో ఇసుక తరలింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. గృహ నిర్మాణ పనులకు ఇసుక కావాల్సిన వారు అనుమతులు తీసుకోవాలని ఇదివరకే చెప్పాం. ఇసుక అక్రమ తరలింపు జరుగుతున్న ప్రదేశాల్లో తనిఖీలు చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. నిబంధనలు మీరితే కేసులు నమోదు చేయిస్తాం.

- తిరుమలబాబు, తహసీల్దార్, సిద్దవటం

పేదల ఆకలి తీర్చడంలో ఎంతో సంతృప్తి ఉంది

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడంలో ఎంతో సంతృప్తి ఉందని, కోడూరు పట్టణంలో అన్న క్యాంటీన్ ప్రారంభించడం తన పూర్వజన్మ సుకృతమని రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రుపానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని చిట్వేలి రోడ్డు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్మించే అన్న క్యాంటీన్ స్థలంలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు కడుపు నింపడానికి క్యాంటీన్ నిర్వహించాలని కోరిక ఉండేదని, ఈ విషయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆ కోరిక తీరందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, రాష్ట్ర యువజన నాయకుడు ముక్కా వికాష్ రెడ్డి, మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా (అల్లాబకాష్), టీడీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, జనసేన నాయకుల తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

రైల్వేకోడూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): తనపై దాడి చేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని బాధితుడు తిరునామల కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఆర్యవైశ్య కులానికి చెందిన వాడనని, మార్కెట్ వీధిలో కిరాణాషాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. పాత బజారు వీధిలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జి.రమేష్ హయాంలో కస్తూరి మెస్ ఎదురుగా కళ్యాణ మండపం నిర్మాణం జరిగిందన్నారు. ఈ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని తెలిసి 25.6.25 తేదీన ఆర్యవైశ్య హక్కుల వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసి వివరణ ఇవ్వాలని అడిగినందుకు తనపై కక్ష పెంచుకున్నారన్నారు. ఈ మేరకు 27.6.25 రాత్రి రమేష్ తన కిరాణా షాపునకు వచ్చిన దాడి చేశాడన్నారు. దుకాణంలో సామాన్లను చిందర వందరగా పడేశాడన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రమేష్‌పై కేసు నమోదు చేశారని తెలిపారు. ఆయన్ను వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని కోరారు. ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా ఈ కేసులో దాడి చేసిన గునిశెట్టి రమేష్‌కు 41 నోటీసు ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జి. రమేష్‌ను వివరణ కోరగా అక్రమాలు జరిగాయని తనపై పోస్టు పెట్టడం సబబుకాదని చెప్పామని, రెండోసారి కూడా గ్రూపులో పెట్టడంతో తాను తీవ్ర ఆందోళనకు గురయ్యానన్నారు. భవన నిర్మాణంలో ఎలాంటి అక్రమాలు జరలేదని, ఆర్యవైశ్య ఖర్చులు, జమ దస్త్రంలో అందరికీ తెలిసే విధంగా లెక్కలు ఉంటాయని వివరించారు. తాను ఎక్కడా అవినీతికి పాల్పడలేదని వివరించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

● ఎంపీడీవో ఫణిరాజకుమారి

సిద్దవటం, జూలై 5 (ఆంధ్రజ్యోతి):గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఫణిరాజకుమారి అన్నారు. శనివారం ఆమె భాకరాపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రం గా పెట్టుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, గ్రామం పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు.

'అన్నమాచార్య'లో ముగిసిన శిక్షణ



శిక్షణా శిబిరంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

రాజంపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్, ఎలాక్ట్రానిక్ ఇంజనీరింగ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, శిక్షణ తరగతుల నిపుణులు భాను, పవన్‌సాయి, డాక్టర్ పద్మలలిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఈఈ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ తరగతుల వల్ల విద్యపై నైపుణ్యం సాధించి సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

సుపరిపాలనకు 'తొలి అడుగు' : టీడీపీ

ఓబులవారిపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కాలం సుపరిపాలనకు గుర్తుగా తొలి అడుగు అని, ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగంలపల్లె, బోటుమీదపల్లె గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. బోటుమీదపల్లె, కాకర్లవారిపల్లె మధ్య సుమారు రూ.60 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు.

పెనగలూరులో...

నల్లపురెడ్డిపల్లెలో శనివారం టీడీపీ నేత, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

కలిసికట్టుగా కమిటీలను ఎన్నుకోవాలి

● టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు

ఒంటిమిట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ నాయకులు అందరూ కలిసికట్టుగా గ్రామ కమిటీలను ఎన్నుకోవాలని రాజంపేట నియోజకవర్గ పరిశలీకుడు చిట్టిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మయూర గార్డెన్‌లో సంస్థాగత ఎన్నికలపై మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి గ్రామ, బూత్ కమిటీలను ఎన్నుకోవాలన్నారు. విభేదాలు విడనాడి అందరూ కలిసికట్టుగా కమిటీలను ఎన్నుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 9 వరకు గ్రామ కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఏడో తేదీన 9 గంటలకు గొల్లపల్లె, 11 గంటలకు పెన్నపేరూరు, మూడు గంటలకు కోనరాజుపల్లె, 4 గంటలకు చింతరాజుపల్లె, 8వ తేదీన ఉదయం 9 గంటలకు కొండమాచుపల్లె, 10 గంటలకు కొత్తమాధవరం, 12 గంటలకు గంగపేరూరు, నాలుగు గంటలకు ఒటిమిట్ట గ్రామ కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. మండల పరిశీలకుడు ఈశ్వరప్ప, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, సీనియర్ నేత ఎస్‌వీ రమణ, రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, ఎంపీపీ ప్రతినిధి నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, మండల నాయకులు బొడ్డే రమణ, ఎంవి రమణ, పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, రేవిళ్ల బాలమునయ్య, హరినాథరెడ్డి, వినోద్‌రెడ్డి, పత్తి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం మొహర్రం



మొహర్రం ఉత్సవంలో పాల్గొన్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం, జూలై5(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతిరూపం మొహర్రం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. మొహర్రం సందర్భంగా శనివారం రాత్రి చిన్నమండెం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన గంధపు పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ధర్మపరిరక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణత్యాగం మానవాళికి దివ్య సందేశాన్ని అందిస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆంకాంక్షించారు. కార్యక్రమంలో తోహిద్, వాజీద్, తంజీర్, సైఫుల్లా, రహంతుల్లా, బాలచంద్రయాదవ్, శంకర్, శివ, కరుణాకర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

పెనగలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో శనివారం మొహర్రం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. కడప జిల్లాలోని పలు మండలాల నుంచి 8 జతల ఎడ్లు బండలాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలో పాల్గొన్న అన్ని ఎడ్లకు నల్లపురెడ్డిపల్లె గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు, 7, 8 నగదు బహుమతులు అందజేశారు.

చిట్వేలి: మండలంలో మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం చిట్వేలిలో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రసాదాలు చదివిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుండం కార్యక్రమం



మొహర్రం సందర్భంగా వీరబల్లిలో ఏర్పాటు చేసిన గుండం

వీరబల్లి,జూలై5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఈడిగపల్లిలో మొహర్రం సందర్భంగా శుక్రవారం రాత్రి గుండం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్నానాలు ఆచరించి గుండంలో దిగారు. అదే విధంగా నెల్లూరు వారిచే ఆర్కెస్ట్రా, సాంస్కృతి కార్యక్ర మాలు నిర్వహించారు. సిరిగిరి కుళాయిరెడ్డి ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదాన చేశారు. ఎలాంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా రూరల్ సీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

'ఇంటింటికీ తిరిగితే ఏం లాభం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు అభివృద్ధి చేయకుండా 'అభివృద్ధికి తొలి అడుగు' అంటూ ఇంటింటికీ తిరిగితే ఏం లాభమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాజంపేటలో జరిగిన వైసీపీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక సంవత్సరంలోనే ఏదో చేసినట్లు సందడి చేసినంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా పరిశీలకుడు, కడప మేయర్ సురేశ్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలి



ఉద్యోగిని సత్కరిస్తున్న లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు

చిట్వేలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు లారీ సుబ్బరాయుడు, సీనియర్ నాయకుడు బాలు రామాంజనేయులు నాయుడు అన్నారు. శనివారం కందులవారిపల్లె గ్రామ సచివాలయ సిబ్బందికి బదిలీ రావడంతో స్థానిక టీడీపీ నాయకులు వారిని సన్మానించారు. బదిలీపై వెళుతున్న ఉద్యోగులు అరవింద్, సుబ్బమ్మ, నిర్మల, సుభద్రమ్మ, హేమ లక్ష్మీలను సత్కరించారు. బాలు రెడ్డయ్యనాయుడు, డేరంగుల వెంకటేశం, వెంకటేష్, రాజు, సుబ్రమణ్యంరెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనండి: ప్రజా సంఘాలు

ఓబులవారిపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మంగంపేటలోని ఏపీఎండీసీ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరూ ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో అన్ని కార్మిక సంఘాల నాయకులు కలిసి ఉద్యోగులు, కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి సమ్మె గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, సంఘాల యూనియన్ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

గాలివీడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులందరూ ఈనెల 15వ తేదీ లోపు రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ రమేశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు క్రాప్‌లోన్లు తీసుకున్న ప్రతి రైతు గడువు లోపు రెన్యూవల్ చేసుకోకుంటే ప్రభుత్వ రాయితీలు వర్తించవన్నారు. అలాగే కల్పలత డిపాజిట్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యవసాయ కార్మిక సంఘం కార్యవర్గంలో మహిళలకు చోటు



ఎన్నికైన మహిళలకు కండువాలు వేస్తున్న మణి

రైల్వేకోడూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మిక కార్యవర్గంలో మహిళలకు చోటు కల్పిస్తున్నట్లు కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట యానాదిపల్లె అరుందతివాడలో వ్యవసాయ కార్మిక మహిళా నూతన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 15 వేల ఎకరాలను వందలాది మంది నిరుపేదలకు పంపిణీ చేశామన్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షురాలిగా శారదమ్మ, ఉపాధ్యక్షురాలిగా నగిరిపాటి కీర్తి, నగిరిపాటి ప్రవళ్లిక, అచ్చమ్మ, కోశాధికారిగా నగిరిపాటి రేణుక వీరితో పాటు సభ్యులుగా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

రాజంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాజంపేట పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయిస్తామని ఉప సంచాలకుడు డాక్టర్ వై.విజయభాస్కర్‌రావు, సహాయ సంచాలకుడు ప్రతాప్‌లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఉచిత రేబిస్ టీకా మందుల కార్యక్రమం ఉంటుందన్నారు. కావున కుక్కలను పెంచుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి నారాయణతో టీడీపీ నేతల భేటీ



మంత్రి నారాయణను సత్కరిస్తున్న కుమార్, కేకేచౌదరి

రాజంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి):పురపాలక శాఖ మంత్రి నారాయణతో రాజంపేటకు చెందిన నాయకులు శనివారం భేటీ అయ్యారు. బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, ఖాదీ బోర్డు రాష్ట్ర చైర్మన్ కేకే చౌదరీలను నెల్లూరు పట్టణ అసెంబ్లీని యోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా నియమించడంతో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన మంత్రి నారాయణతో వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నారాయణను సత్కరించి ఆ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రాజంపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాజంపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం తాళ్లపాక అన్నమాచార్యుల ఆరాధ్య దైవాలైన సిద్దేశ్వర, చెన్నకేశవస్వాముల బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆదివారం నుంచి 15వ తేదీ వరకు ఉత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అన్నమయ్య ధ్యానమందిరంను, కల్యాణ మండపాన్ని ముస్తాబు చేశారు. తాళ్లపాక ముఖద్వారం వద్ద విద్యుద్దీపాలంకరణలతో కటౌట్‌లు, స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు.

చంద్రబాబు సుపరిపాలనకు ప్రజల ఆశీర్వాదాలు

రాయచోటిటౌన్, జూలై5(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ఏడాది సుపరిపాలనకు ఇంటింటా ప్రజలు ఆశీర్వాదాలు అందిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శనివారం ఆయన ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాయచోటి నియోజకవర్గంలో వైసీపీ నాయకులు కేవలం తమ సొంత ప్రయోజనాల గురించి ఆలోచించారే తప్ప ప్రజల కష్టాల గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి మండిపల్లి రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి, సాగునీటి సమస్యను పరిష్కరించారన్నారు.

మాజీ మండలాధ్యక్షుడు మడితాటి రాజారెడ్డి మృతి



మడితాటి రాజారెడ్డి (ఫైల్)

రాయచోటిటౌన్, జూలై5(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో నివాసం ఉంటున్న ప్రైవేట్ బస్సుల యజమానులు మడితాటి చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ మడితాటి మధుసూదన్‌రెడ్డిల తండ్రి, మాజీ మండలాధ్యక్షుడు మడితాటి రాజారెడ్డి శనివా రం గుండెపోటుతో మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

రాజారెడ్డి మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడికి ముఖ్య అనుచరుడుగా, ఆయన విజయానికి కీలకంగా వ్యవహరించారు. రాయచోటి మండల అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన మృతి పట్ల మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

ఉగ్రవాదుల మూలాలపై సమగ్ర విచారణ జరపాలి

రాజంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాయచోటిలో అరెస్ట్ అయిన ఇస్లామిక్ ఉగ్రవాదుల మూలాలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల ఇన్‌చార్జి పోగుతుంట రమేష్‌నాయుడు అన్నారు. శనివారం రాజంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీనిపై జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు.

మంత్రి వచ్చారు.. వెళ్లారు!



● జూనియర్ కళాశాలలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు ● వేధిస్తున్న పాముల బెడద
● అసాంఘిక చర్యలకు నిలయాలుగా భవనాలు ● ప్రతి ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

మంత్రి వచ్చి వెళ్లారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలు ఇకపై పరిష్కారం అవుతాయని భావించిన విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. మంత్రి వచ్చి వెళ్లి ఐదు నెలలు గడుస్తున్నా ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ములకలచెరువు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులోని జడ్పీ హైస్కూల్ భవనాల్లో 1994లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం కాగా, 1997-98 విద్యా సంవత్సరంలో ప్రభుత్వా స్పత్రి సమీపంలో నిర్మించిన భవనంలోకి తరగతి గదులను మార్చారు. అప్పట్లో నాలుగు తరగతి గదులే నిర్మించగా, 2009లో పనికి ఆహార పథకం కింద ఆఫీసు గదిని నిర్మించారు. ఆ తర్వాత కళాశాల అభివృద్ధిని గాలికి వదిలేశారు. కళాశాల ఉన్నది గుట్ట ప్రాంతం కావడంతో పాటు వెనుక భాగంలో ప్రహరీగోడ లేకపోవడంతో పాముల బెడదతో విద్యార్థులు హడలెత్తిపోతున్నారు. తరగతి గదుల్లోకి పాములు వచ్చిన సంఘటనలు లేకపోలేదు. కళాశాల ప్రారంభ సమయంలో 27 ఏళ్లకు ముందు నిర్మించిన నాలుగు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. తరువాత తరగతి గదులు నిర్మించలేదు. బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమెస్ట్రీ ల్యాబ్‌లు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. పాఠశాలలో ఇప్పటి వరకు కనీసం బోరు కూడా వేయకపోవడంతో గ్రామ పంచాయతీ కొళాయిల్లో వచ్చే నీరే దిక్కయింది. గత వైసీపీ హయాంలో నాడు - నేడు కింద ప్రారంభించిన మరుగుదొడ్ల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ కారణాలతో జూనియర్ కళాశాలలో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.


కూలిపోయిన ప్రహరీ గోడ


కళాశాల వెనుక వైపు పెరిగిన పిచ్చి మొక్కలు

మందుబాబులకు అడ్డా..

ప్రభుత్వ జూనియర్ కళాశాల మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రహరీ గోడ లేకపోవడం, దగ్గరలోనే మద్యం దుకాణం ఉండడంతో రాత్రి వేళల్లో మందుబాబులు కళాశాల భవనాలను వినియోగించుకుంటున్నారు. దీంతో ప్రతిరోజు ఉదయం కళాశాల ప్రాంగణంలో మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తాయి. దీనికితోడు మద్యం సీసాలు పగులగొట్టి వెళుతుండడంతో గాజు పెంకులు గుచ్చుకుని విద్యార్థులు గాయపడుతున్నారు.

మంత్రి వచ్చినా.. పరిష్కారం కాలేదు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డితో కలిసి ఈ ఏడాది జనవరి 4న కళాశాలను సందర్శించారు. అప్పట్లో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఆయన హామీ ఇచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఐదేళ్లుగా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

విద్యా సంవత్సరం	ఫస్ట్ ఇయర్	సెకండ్ ఇయర్	మొత్తం
2021-22	155	166	321
2022-23	79	160	239
2023-24	54	94	148
2024-25	109	70	189
2025-26	70	102	172

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



జూనియర్ కళాశాలలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరిస్తామని చెప్పారు. ప్రహరీ గోడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అదనపు తరగతి గదులు, ల్యాబ్‌ల ఏర్పాటుకు గదులు కావాలి. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరాం.

- నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్

సమస్యలతో సతమతం



కళాశాలలో సమస్యలతో సతమతమవుతున్నాం. కనీసం తాగడానికి మంచి నీరు కూడా లేవు. వాటర్ క్యాన్లను కొనుక్కుని తాగుతున్నాం. ప్రహరీ గోడ లేక పోవడంతో రక్షణ కరువైంది. పాములు తరగతి గదుల్లోకి వస్తున్నాయి. కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

-మానస, విద్యార్థిని

వినాయకుడి విగ్రహం అపహరణ కేసులో 13 మంది అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి

పెనగలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వినాయకుడి విగ్రహం అపహరణ కేసులో 13 మందిని అరెస్టు చేసినట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ తెలిపారు. శనివారం పెనగలూరు పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 24 తెల్లవారుజామున అత్తిగారిపల్లె బీసీ కాలనీ సమీపంలోని వినాయకుడి రాతి విగ్రహం అపహరణకు గురైంది. ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ముద్రపల్లె క్రాస్‌రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న 13 మందిని అరెస్ట్ చేసి, విచారణ చేయగా, వారంతా వినాయకుని విగ్రహం అపహరణ కేసులో నిందితులుగా తేలింది. వారంతా పికొత్తపల్లె, ఈటమాపురం, మనుబోలు, చింతకాయలపల్లి, కొందరు తమిళులుగా గుర్తించారు. ఈ 13 మంది ముఠాగా ఏర్పడి విగ్రహాన్ని ఓదేటివారిపల్లె క్రాస్‌రోడ్డు వరకు ఈడ్చుకుని పోయి, అక్కడి నుంచి ట్రాక్టర్లో ఈటమాపురం చెరువులోనికి తీసుకెళ్లారు. అక్కడ విగ్రహాన్ని పగులగొట్టి చూడగా, అందులో ఎలాంటి విలువైన వస్తువులు లభించలేదని తేలింది. ఈ కేసులో ముగ్గురు మహిళలతో పాటు పది మంది పురుషులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసు ఛేదించిన పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాయుడు, రవిశంకర్‌ను ఆయన అభినందించారు. సాంకేతికపరంగా వీరికి సహకరించిన స్టేషన్ సిబ్బందిని అభినందిస్తూ, రివార్డుల కోసం ఎస్పీకి సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులు పగులగొట్టిన విగ్రహం రాతి ముక్కలు, ఒక ఇన్నోవా కారు నాలుగు మోటార్‌బైకులు ఒక ట్రాక్టర్, సమ్మెట, క్షుద్ర పూజలు కోసం ఉపయోగించిన నిమ్మకాయలు, పసుపు, కుంకుమలను సీజ్ చేసినట్లు వివరించారు

గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి విక్రేతతో సిద్దవటం పోలీసులు

సిద్దవటం, జూలై5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శనివారం సిద్దవటం పోలీసులు అరెస్టు చేశారు. ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపిన వివరాల మేరకు.. కడప నగరానికి చెందిన రెడ్డి నరేశ్ అనే వ్యక్తి మండలంలోని భాకరాపేటలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 1200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. వైజాగ్ జిల్లా చింతపల్లి గ్రామం నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి కడప నగరంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మరి కొంతమందిని విచారణ చేయాల్సి ఉందన్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.20 వేలు ఉంటుందని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని సిద్దవటం జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్‌రఫీ, హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య, రైటర్ రాముడు, కానిస్టేబుల్ రాఘవ పాల్గొన్నారు.

ముగ్గురిపై దాడి కేసు నమోదు

కలకడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళ్లపల్లె పంచాయతీ బొజ్జగుంటపల్లె వడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులపై దాడి చేసిన ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు శ్రీనివాసులు అదే గ్రామంలోని రామాలయం వద్ద కూర్చుని సెల్‌ఫోన్ చూస్తుండగా అక్కడికి వచ్చిన రెడ్డిప్రసాద్, భార్య సౌజన్య, మరదలు సురేఖ తమను ఫోటో తీశాడంటూ శ్రీనివాసులు, అతని కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెచ్‌సీ తెలిపారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు


కుక్కల దాడిలో గాయపడిన జింక

తంబళ్లపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడికి గురైన జింకను ఓ వ్యక్తి కాపాడాడు. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన మల్లికార్జునరెడ్డి శుక్రవారం రాత్రి తోటలో పనులు చూసుకుని ఇంటికి వెళ్తుండగా కుక్కలు జింకపై దాడి చేస్తుండడం కనిపించింది. దీంతో ఆయన కుక్కలను చెదరగొట్టి జింకను కాపాడి తన తోటలోని షెడ్డు వద్దకు చేర్చాడు. అటవీ సిబ్బంది, పశువైద్యులకు సమాచారం ఇచ్చాడు. శనివారం తెల్లవారుజామునే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామరాజు, పశు వైద్యురాలు ఇందు తోట వద్దకు చేరుకుని గాయపడిన జింకకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం అవసరమవ్వడంతో మదనపల్లె పశువైద్యశాలకు తరలించారు.

యువకుడి ఆత్మహత్య


మస్తాన్ మృతదేహం

పీలేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): యమహా షోరూములో మెకానిక్‌గా పనిచేస్తున్న మస్తాన్(30) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మస్తాన్, శనివారం సాయంత్రం ఇంటిలోని తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఆ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిరారించారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. పీలేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమిత ప్రభుత్వ స్థలం స్వాధీనం


అధికారులు కూల్చివేసిన అక్రమ కట్టడం

కురబలకోట,జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ధనంజయులు తెలిపారు. మండలంలోని చింత మాకులపల్లె వాసి ఎస్. బాబురెడ్డి సర్వేనంబర్ 817లో గ్రామ చెరువులోని 15 సెంట్ల భూమిని ఆక్రమించుకుని రేకుల షెడ్డును నిర్మించుకున్నాడు. దీనిపై అధికారులు స్పందించి ఆక్రమ కట్టడాలను కూల్చి భూమి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషాద్రి, పాల్గొన్నారు.

రేపు నిత్యపూజేశ్వర హుండీ లెక్కింపు

సిద్దవటం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం జూలై 7న ఉదయం 10 గంటలకు నిత్యపూజేశ్వరస్వామి ఆలయంలో జరుగుతుందని ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పోలీసులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు షురూ

● సోమవారం నుంచి ఉత్తర్వుల జారీ

కలికిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన గడువు శనివారంతో ముగిసింది. సచివాలయాల్లో వివిధ కేటగిరీల్లోని పోస్టులను హేతుబద్ధంగా సర్దుబాటు చేస్తూ, జూన్ 30 లోగా పూర్తి చేయాలని జూన్ 12న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ ముగిసి, బదిలీలకు అర్హతగలిగిన వారందరికీ గత వారం కౌన్సెలింగ్ కూడా పూర్తి చేసింది. కొన్ని జిల్లాల్లో కౌన్సెలింగ్ ముగిసిన అనంతరం బదిలీ ఉత్తర్వులు మాత్రం జారీ చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. జూలై 1 నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉండడంతో సచివాలయాల శాఖ డైరెక్టరు జూన్ 26న జిల్లా కలెక్టర్లకు ఒక సర్క్యులర్ జారీ చేశారు. కౌన్సెలింగ్ మాత్రం గడువులోగా పూర్తి చేసి బదిలీలు, పోస్టింగ్ ఉత్తర్వులను జారీ చేయకుండా సూచనలిచ్చారు. ఈ కారణంగా కౌన్సెలింగ్ పూర్తయినా సచివాలయ ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేయలేదు. బదిలీ ఉత్తర్వులు జారీ చేసే గడువును ఈ నెల 5 వరకూ పొడిగించాలని సచివాలయ శాఖ డైరెక్టరు ప్రభుత్వాన్ని కోరారు. పరిశీలించిన ప్రభుత్వం శనివారం వరకూ బదిలీ ఉత్తర్వులు జారీ చేయవచ్చంటూ గ్రామ వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం


ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం


రామాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకానికి రైతులు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం తెలిపారు. శనివారం మండలంలో బండపల్లి గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. రైతులు తమ పొలాల వద్ద ఫారంపాండ్ ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబులేసు, టీఏ కళావతి, ఫీల్డ్ అసిస్టెంట్లు సురేంద్ర పాల్గొన్నారు.

కోదండరామాలయానికి ఎన్నారై విరాళం


విరాళంఅందజేస్తున్న శశిభూషణ్‌రాజు

సంబేపల్లె, జూలై5(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె గ్రామం అంబేద్కర్‌నగర్‌లో నిర్మిస్తున్న కోదండ రామాలయానికి ఎన్నారై శశిభూషణ్ రాజు శనివారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శశిభూషణ్‌రాజు దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్నారై మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలతో ప్రజల్లో భక్తిభావం పెంపొందుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆలయాల నిర్మాణాలను ప్రభుత్వం చొరవతో పాటు దాతల సహకారంతో ఆలయాలు నిర్మించడం గొప్ప విశేషమన్నారు. మాజీ సర్పంచ్ గోపాల్, సుబ్బరాజు, రెడ్డెన్న, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కమనీయం నరసింహస్వామి కల్యాణం


నరసింహస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని వేదపండితులు శనివారం శ్రీదేవి, భూదేవిలతో కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో ప్రతి నెలా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా చేశారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, వరద, ఆలయ సిబ్బంది నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండ

● తప్పుడు ప్రచారంతో వైసీపీ పైశాచిక ఆనందం
● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడి రైతులు నష్టపోకుండా ఫ్యాక్టరీలు కిలో రూ.8తో కొంటుండగా ప్రభుత్వం అదనంగా కిలోకు రూ.4లు ఇస్తోందన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మామిడి దిగుబడి భారీగా పెరిగిందన్నారు. దీంతో ప్రభుత్వం ముందుగా అప్రమత్తమై రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో సబ్సిడీ ఇస్తోందన్నారు. ప్రభుత్వం కిలో రూ.8తో కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ఫుడ్స్ రైతుల నుంచి కిలో రూ.3కే కొనుగోలు చేస్తోందన్నారు. నష్టాల్లో ఉన్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంటే తప్పుడు ప్రచారం చేస్తూ వైసీపీ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. కష్ట సమయాల్లో కిలో రూ.4 సబ్సిడీ ఇచ్చి ఆదుకుంటున్న ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసేందుకే జగన్‌రెడ్డి రైతులపై దండయాత్రకు బయలుదేరాడన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో భారీగా కేసుల పరిష్కారం


రాయచోటి కోర్టులో కేసులను విచారిస్తున్న జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి


రాజంపేటలో బాధిత కక్షిదారుకు పరిహారం అందజేస్తున్న న్యాయాధికారులు

రాయచోటిటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాయచోటి, రాజంపేట కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కారమయ్యాయి. రాయచోటి కోర్టులో జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తేజస్విని 906 కేసులను పరిష్కరించారు. రోడ్డు ప్రమాదాల కేసుల్లో రూ.1,93,77,873ల నష్ట పరిహారం బాధితులకు చెల్లించారు. న్యాయవాదులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట కోర్టులో 204 క్రిమినల్ కేసులు, ఆరు సివిల్ కేసులు పరిష్కారం కాగా, కక్షిదారుల నుంచి 62,24,466 రూపాయలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా అదనపు జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దంపతులకు సంబంధించిన ఓ కేసులో 20 లక్షల రూపాయలతో రాజీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్‌జడ్జి సి.రాజన్‌ఉదయప్రకాష్, పీపీటీ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, జి.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నికల్లో వాగ్వాదం

● దూషించుకున్న తెలుగు తమ్ముళ్లు


శ్రీనివాసులునాయుడుతో వాగ్వాదం చేస్తున్న గొల్లపల్లి టీడీపీ నేతలు

రామసముద్రం జూలై 5(ఆంధ్రజ్యోతి):ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ కొందరు టీడీపీ నాయకులు ఎన్నికల పరిశీలకులతో వాగ్వాదానికి దిగడంతో గ్రామ కమిటీ ఎన్నికల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రామసముద్రం మండలంలోని అరికెల, మానేవారిపల్లె, మాలేనత్తం, కేసీపల్లె, మూగవాడి, చొక్కాండ్లపల్లె, మినికి, రాగిమాకులపల్లె, ఊలపాడు పంచాయతీలకు సంబంధించి శనివారం పరిశీలకుడు శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. మొదట అరికెల పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి నలుగురు పోటీ పడ్డారు. అయితే, హనుమంతురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పరిశీలకుడు శ్రీనివాసులునాయుడు ప్రకటించారు. భోజనం అనంతరం మూగవాడి పంచాయతీ ఎన్నిక జరగాల్సి ఉండగా, తమకు తెలియకుండా ఓ వర్గానికి చెందిన వ్యక్తిని గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఎంపిక చేస్తూ పరిశీలకుడు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని మరో వర్గానికి చెందిన శ్రీనివాసులు నిలదీశారు. దీనితో ఆ నిర్ణయాన్ని విరమించుకుని ఆశావహుల పేర్లను నమోదు చేసుకున్నారు. మినికి పంచాయతీలో కూడా టీడీపీ నేతలు పోటీ పడ్డారు. రాగిమాకులపల్లెకు సుబ్రహ్మణ్యం, ఊలపాడుకు వెంకటాచలపతి, చొక్కాండ్లపల్లె రెడ్డెప్పరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా గ్రామ కమిటీ అధ్యక్షుల ఎంపిక ఎన్నికలలో మండల టీడీపీ నాయకుల మధ్య ఉన్న వర్గపోరు మరోమారు బయటపడింది. కార్యకర్తలు, అభిమానులు విభేదాలు వీడి పార్టీకి అంకిత భావంతో పనిచేస్తుంటే కొందరు నాయకులు పార్టీని తమ స్వలాభం కోసం వాడుకుంటున్నారని, ఇది ఇలాగే కొనసాగితే రాబోయే స్థానిక ఎన్నికలలో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని, ఇప్పటికైనా పరిశీలకులు మండల పరిస్థితిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి వర్గపోరుకు బ్రేకులు వేయాలని టీడీపీ కార్యకర్తలు, అభిమానులు కోరుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పది మందికి గాయాలు


కురబలకోట: సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


సంబేపల్లె: కాలు విరగడంతో కూర్చుండిపోయిన ఆటో డ్రైవర్ జాన్

కురబలకోట, జూలై 5(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పది మంది గాయపడగా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది వివరాలిలా.. పెద్దమండ్యం మండలం ముసలికుంటకు చెందిన రైతులు బొలెరో వాహనంలో అంగళ్లు గొర్రెల సంతనుంచి స్వగ్రామానికి వస్తూ కురబలకోట రైల్వేగేటు సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. దీంతో వాహనం బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న పెద్దమండ్యం మండలం ముసలికుంట పంచాయతీ దట్టినాయక్ తాండాకు చెందిన కృష్ణానాయక్(60), ఆయన కుమారుడు బాలాజీ నాయక్(30), బండ్రేవుకు చెందిన లక్ష్మయ్య(50), ముసలికుంటకు చెందిన మల్‌రెడ్డి (45), రామాంజనేయరెడ్డి (28), ద్విచక్రవాహనదారుడు గాలివీడు మండలం బలిజపల్లెకు చెందిన మహేష్(32) గాయపడ్డారు. మహేష్ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలాజీనాయక్, కృష్ణానాయక్, మహేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంబేపల్లె : ఆటోను కారు ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. శెట్టిపల్లె గ్రామం నదిపిరివాండ్లపల్లెకు చెందిన జయనారాయణరెడ్డి హరిజనవాడకు చెందిన రమేశ్ అతని భార్య అలివేలు, కోడలు రెడ్డెమ్మతో కలిసి కారులో రాయచోటికి వస్తుండగా పీఎస్‌కాలనీ సమీపంలో డ్రిప్, ఎరువుల లోడ్‌తో వెళుతున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో అలివేలమ్మ, ఆటో డ్రైవర్ జాన్‌కు కాలు విరిగింది. రెడ్డెమ్మ, జయనారాయణరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలియజేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కడప క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు కేజీల 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కడప చిన్నచౌకు ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐలు విశ్వనాథరెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లెకు చెందిన కడియాల పవన్‌కుమార్ బీటెక్ మధ్యలో వదిలేశాడు. అదే గ్రామానికి చెందిన మోటుపల్లి సతీష్‌చంద్ర డిగ్రీ రెండో సంవత్సరం చదువు సాగించారు. వీరు స్నేహితులుగా ఉంటూ చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు కడపలోని నందిమండలం గణేశ్, కడపకు చెందిన ప్రింటర్ చల్లా వినోద్, నారాయోగేషులు బద్వేలుకు చెందిన చిన్నన్నం నాగేంద్ర ద్వారా గంజాయి తెప్పించుకుని వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. శనివారం ఉదయం సమాచారం రావడంతో సీకే దిన్నె మండలం ఊటుకూరు వద్ద ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో కలిసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి కేజీ 25 గ్రాములు కలిగిన ఆరు ప్యాకెట్లు గంజాయి, బైకు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసకున్నట్లు తెలిపారు. అలాగే మరో కేసులో అప్సర సర్కిల్ వద్ద కడపకు చెందిన షేక్ గుడు సబ్‌వలి, కొత్తపేటకు చెందిన గోపిరెడ్డి మునీష్ కుమార్ రెడ్డి గంజయి విక్రయంచేందుకు సిద్దంగా ఉన్నట్లు సమా చారం రావడంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి సిబ్బందితో అరెస్టు చేసి, కేజీ 100 గ్రాములు కలిగిన గంజాయి , రెండు బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు



హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఎర్రగుంట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఈ నెల 1వ తేదీ జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన షేక్షావల్లికి హసీనా అనే చెల్లెలు ఉంది. ఆమెకు భర్త చనిపోయి 15 సంవత్సరాలు అయ్యింది. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరు ఆర్ట్స్ కాలేజి రోడ్డు గురువయ్య తోటకు చెందిన షేక్ జాఫర్ వల్లితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. జూన్ 27వ తేదీ హసీనాను కడపలోని ఆమె తల్లివద్ద జాఫర్ వదిలి వెళ్లాడు. 30వ తేదీ హసీనాను పిల్చుకుని వెళ్లేందుకు అక్కడికి వెళ్లగా ఆమె అన్న షేక్షావల్లి చూసి తన చెల్లెలి జోలికి ఇకపై రావద్దని మందలించాడు. దీంతో తనకు హసీనాకు మధ్యలో అడ్డుగా ఉన్న షేక్షావల్లిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు. జూలై 1న కడపకు వెళ్లి షేక్షావల్లిని మద్యం తాగుదామని పిలిచాడు. ఇందుకు ఆయన అంగీకరించడంతో ఎర్రగుంట్లకు వెళ్లి కుక్కలు పడదామని.. ఆ వచ్చిన డబ్బుతో మద్యం తాపుతానని ఆయన నమ్మించాడు. అతని మాటలు నమ్మి జాఫర్ వెంట ఎర్రగుంట్లకు వచ్చాడు. అదే రోజు సాయంత్రం మద్యం తాగేందుకు ఎర్రగుంట్ల మార్కెట్ యార్డుకు వెళ్లారు. ఎలాగైనా షేక్షావల్లిని చంపాలనుకున్న జాఫర్ గోదాం వెనుకకు తీసుకెళ్లి అతిగా మద్యం తాపించాడు. మద్యం మత్తులో ఉన్న షేక్షావల్లిని బండరాయితో తలపై కొట్టి చంపాడు. అనంతరం జాఫర్ అక్కడి నుంచి పరరాయ్యాడు. షెక్షావల్లి తమ్ముడు సయ్యద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎర్రగుంట్ల పోలీసులు హత్య కేసు మిస్టరీని ఛేదించి నిందితుడు జాఫర్‌ను అరెస్టు చేశా రు. కార్యక్రమంలో సీఐ నరేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన బాలాజీ

కమలాపురం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కడప- తాడిపత్రి జాతీయ రహదారి టి.చదిపిరాళ్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో జాన బాలాజీ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థాని కులు, పోలీసుల సమాచారం మేరకు కమలాపురం పట్టణానికి చెందిన బాలాజీ భారతి సిమెంటు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యా హ్నం డ్యూటీకి వెళ్లారు. మరుసటి రోజు శనివారం తెల్లవారు జామున డ్యూటీ ముగించుకుని ఇంటికి బయల్దేరారు. చదిపిరాళ్ల గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆల్విన్‌వాహనం స్కూటరును ఢీకొంది. దీంతో బాలాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని విగత జీవిగా పడి ఉన్న బాలాజీని చూసి కన్నీరు మున్నీరుగా విలపించా రు. మృతునికి భార్య శృతి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

చస్తే.. చావే..!

- ఆరడుగుల జాగా కోసం ఆలంఖాన్‌పల్లె శ్మశానంలో అవస్థలు
- మురుగునీటితో చెరువులా శ్మశానం



శ్మశాన వాటికలోని కామ్రేడ్ల స్థూపాల వద్ద మురుగునీరు



ఆలంఖాన్‌పల్లె శ్మశాన వాటికలో మురుగు నీటిలో తేలుతున్నట్టు కనిపిస్తున్న సమాధులు

కడప మారుతీనగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): చనిపోయిన వారిని సమాధుల వద్దకు వెళ్లి నివాళి అర్పించి స్మరించుకునే సంప్రదాయం అన్ని మతాల్లోనూ ఉంది. హిందువులు ఉగాది, సంక్రాంతి పండుగల సమయంలో తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి టెంకాయలు కొట్టి వారిని స్మరించుకుని వస్తుంటారు. అయితే.. ఆలంఖాన్‌పల్లె వాసులకు మాత్రం ఇది సాధ్యం కావడం లేదు. ఎందుకంటే ఇక్కడి శ్మశానం దశాబ్దాలుగా మురుగునీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది.

కడప నగరంలోని 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో ఐదువేలకు పైగా జనాభా ఉన్నారు. అయితే వీరికి సరైన శ్మశాన వాటిక లేదు. ఉన్న శ్మశానంలో మురుగునీరు నిల్వ ఉంది. మామూలు రోజుల్లోనే ఆ శ్మశానంలో శవాన్ని పూడ్చాలంటే అగ్నిపరీక్షే. అలాంటిది వర్షాకాలంలో మరీ నరకయాతన తప్పదు. పాలకులు, అధికారులు మారుతున్నారే గానీ ఆలంఖాన్‌పల్లె శ్మశానవాటిక దుస్థితిలో ఎలాంటి మార్పురాలేదు. కాలం గడిచే కొద్దీ ఆ శ్మశానంలో శవాన్ని పూడ్చలేని దశకు చేరుకుంది. ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ నాయకులు శ్మశానం అభివృద్ధి చేయిస్తామని చెబుతున్నారే కానీ తర్వాత పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులకు, కార్పొరేషన్ కమిషర్‌కు శ్మశానవాటిక దుస్థితిపై పలుమార్లు తెలిపినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్.మాధవి అయినా ఆలంఖాన్ పల్లె శ్మశానాన్ని పట్టించుకోవాలని వారు కోరుతున్నారు.

నూతన బోధన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

వేంపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతిక విద్యలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఎప్పటికప్పుడు నూతన బోధనా పద్ధతులపై అవగాహన పెంచుకొని విద్యార్థులకు బోధించాలని జలంధర్ నిట్ మెకానికల్ హెచ్ఓడీ, ప్రొఫెసర్ శ్రీనివాస్ సూచించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో బోధనా సిబ్బందికి ఫలిత ఆధారిత విద్య అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ శుక్ర, శనివారాల్లో జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక విద్యలో ఓబీఈ ప్రాముఖ్యత, పాఠ్యాంశాల రూపకల్పన, మూల్యాంకనంపై అవగాహన కల్పించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, వర్క్‌షాప్ ప్రతినిధులు కోటేశ్వరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి

జమ్మలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అగ్రికల్చరల్, హౌసింగ్, చేనేత, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ , మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించిన అభివృద్ధితో పాటు బంగారు కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై చర్చించారు. విజన్ ప్లానింగ్‌లో భాగంగా 2029 నాటికి బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఇందుకు అధికారులు అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

ఆప్కో చేనేత అమ్మకాలపై డిస్కౌంట్

కడప మారుతీనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం సందర్భంగా ఆప్కోవారు చేనేత వస్త్రాల అమ్మకాలపై 30 శాతం నుంచి 50శాతం డిస్కౌంటు ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి కోటేశ్వర్‌రావు వెల్లడించారు. ఆ మేరకు కడప నగర వన్‌టౌన్ సమీప క్లాక్ టవర్ పక్కనే గల ఆప్కో మెగా షోరూంలో, కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆప్కో విక్రయశాలలో, పులివెందులలోని జయమ్మ మున్సిపల్ కాంప్లెక్స్‌లో, రాయచోటి బస్టాండు వద్ద, కోడూరు, చిట్వేలి రోడ్డు, రాజంపేట పాతబస్టాండు వద్ద గల ఆప్కో షోరూంలలో ఈ డిస్కౌంటు సేల్స్ అవకాశం కలదన్నారు. ఇందులో అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 35 శాతం నుంచి 50 శాతం వరకు డిస్కౌంటు ఉందన్నారు. ముఖ్యంగా ఆప్కోలో మంగళగిరి, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, వెంకటగిరి, మాధవరం, చీరాల, కాటన్, పట్టు చీరలు, డ్రెస్ మెటీరియల్స్ రెడిమేడ్ షర్ట్స్ దుప్పట్లు, దోవతులు, లుంగీలు, టవల్స్ తదితర అన్నిరకాలపై 30 శాతం డిస్కౌంటు కలదన్నారు.

గర్భిణీ మృతిపై త్రీమన్ కమిటీ విచారణ

బద్వేలు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన గర్భిణీ గత నెల 29న వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన వార్త కథనాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు నియమించిన త్రీమాన్ కమిటీ శనివారం తొట్టిగారిపల్లె ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో విచారణ చేపట్టారు. ఈ కమిటీలోని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్రీయ బాలుర సురక్ష కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లేశ్‌లు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు హెల్త్ ఆఫీసరు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్, ప్రైవేటు హాస్పిటల్ డాక్టర్లను విచారించారు. మరణానికి సంబంధించిన అన్ని విషయా లను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో తొట్టిగారిపల్లె ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపంటెండెంట్, వైద్యాధికారులు, కమ్యూనిటీ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలతల భూములకు వేలం

పెండ్లిమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వరస్వామి దేవ స్థానం భూములకు ఈనెల 9న బుధవారం దేవస్థానంలో అధికా రు ల సమక్షంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గంగనపల్లె, తిప్పిరెడ్డిపల్లె, కొత్త గిరియంపల్లె రెవెన్యూ గ్రామాల పరిధిలో 23 ఎకరాలకు బహిరంగ వేలంలో హెచ్చు పాటదారునికి మూడేళ్ల కాలానికి కౌలుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. పాటదారుడు ప్రతి సంవత్సరం మార్చి నెలా ఖరు లోపు మునుగుత్త చెల్లించి భూమిలోకి దిగాలన్నారు.

యువతి అదృశ్యం

దువ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబాకరాపురం గ్రామానికి చెందిన సుచరిత (19) అనే యువతి శుక్రవారం రాత్రి నుంచి కనిపించడం లేదు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఈమె ఇంటి వద్ద ఖాళీగా ఉండేది. ఉన్నఫలంగా కనిపించకపోవడంతో తండ్రి జొన్నవరం ఓబులేసు శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

మూడు గ్రామ కమిటీల ఎన్నిక వాయిదా

- సంస్థాగత పదవులకు విపరీతమైన పోటీ



సీటీఎం-1 గ్రామ సంస్థాగత ఎన్నికల విషయమై సమావేశమైన పరిశీలకులు, నాయకులు

మదనపల్లె టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో విపరీతమైన పోటీ నెలకొంది. నియోజకవర్గంలో టీడీపీలో మూడు వర్గాలు ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. నాలుగు రోజులుగా మదనపల్లె పట్టణం, మదనపల్లె మండలంలోని టీడీపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర పరిశీలకుడు గురుమూర్తి గౌడ్, నియోజకవర్గ పరిశీలకుడు సురేష్‌రాజు వచ్చారు. వీరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. అనంతరం మండలంలోని గ్రామాల్లో వీరు స్వయంగా పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మదనపల్లె మండలంలోని సీటీఎం-1, సీటీఎం-2, కొత్తవారిపల్లె, దుబ్బిగానిపల్లె, పోతబోలు గ్రామాల్లో పరిశీలకులు పర్యటించారు. కాగా సీటీఎం-1లో నిర్వహించిన సమావేశంలో గ్రామ కమిటీ పదవులకు తీవ్రపోటీ నెలకొంది. దీంతో నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరక సీటీఎం-1, సీటీఎం-2, కొత్తవారిపల్లె, దుబ్బిగానిపల్లె గ్రామ కమిటీ ఎన్నిక వాయిదా వేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జులు ఎంసీ నందకుమార్, చల్లా నరసింహులు, చల్లా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణానికి అనువైన పంటలు సాగు చేయాలి

సీకేదిన్నె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతులు వాతావరణానికి అనువైన పంటలు సాగు చేసే విధంగా అవగాహన కలిగించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శనివారం కడప, అన్నమయ్య జిల్లాల్లోని వ్యవసాయ ఉప సంచాలకులకు శిక్షణ, సందర్శన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షాభావ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయడం మంచిదన్నారు.

జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ వ్యవసాయాధికారులు తగిన సలహాలు, సూచనలు అందించి... రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసి నష్టపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త వీరయ్య, శాస్త్రవేత్తలు మాధురి, శ్రీవల్లి, భాగవతప్రియ, ఆక్వా పీడీ విజయలక్ష్మి, రెండు జిల్లాల ఏడీఏలు పాల్గొన్నారు.

ఆరుగురికి తిరుపతి స్విమ్స్‌లో వైద్యపరీక్షలు

పులివెందుల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జెండాలు తొలగించిన సమయంలో నమోదైన కేసులో ఉన్న ఆరు గురికి మరోసారి తిరుపతి స్విమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహిం చారు. శనివారం ఈ వైద్యపరీక్షల కోసం సీఐ చాంద్‌బాష ఆధ్వర్యంలో ఆరుగురిని పార్నపల్లె కిషోర్, సాతుపాటి రాజేష్, కావేటి మల్లికార్జున, షేక్ మస్తాన్, పార్నపల్లె వెంక టచలపతి, సాతుపాటి వెంకటపతిలను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. మే నెలలో జరిగిన టీడీపీ మహానాడు సంద ర్భంగా పులివెందులలో కట్టిన జెండాలను తొలగించి అడ్డుప డిన వ్యక్తిని మారణాయుధాలతో చంపేందుకు ప్రయత్నించారని హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ సమయంలో పోలీసులు మమ్మల్ని కొట్టారని ఈ కేసులో ఉన్న ఆరుగురు కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో మొదట జమ్మల మడుగు కోర్టు పులివెందుల ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించాలని ఆదేశాలు జారీ చేసింది. అక్కడ సరిగా చేయలేదని హైకోర్టును ఆశ్రయించడంతో జూన్ 18 కర్నూలు వైద్యశాలలో పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడవారికి 20న వైద్య పరీక్షలు నిర్వహించినా సరిగా చేయలేదని మరోమారు హైకోర్టును ఆశ్రయించడంతో తిరుపతి స్విమ్స్‌లో నిర్వహించాలని జూన్ 30 తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. వారం రోజుల లోపు వైద్యపరీక్షలు నిర్వహించి సంబంధించిన రిపోర్టును కోర్టుకు సమర్పించాలని కోరింది. దీంతో అర్బన్ సీఐ చాంద్‌బాష శనివారం తిరుపతి స్విమ్‌లో వైద్యపరీక్షలకు తీసుకెళ్లారు.

వెనకంజలో కర్నూలు, ఆధిక్యంలో నెల్లూరు జట్టు



వీరారెడ్డి (అనంతపురం) మహిత్ (కర్నూలు) భార్గవ మహేశ్ (నెల్లూరు)

కడప స్పోర్ట్స్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీ డే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా రెండో రోజు శనివారం కర్నూలు జట్టు 158 పరుగుల వెనకంజలో ఎదురీదుతోంది. అలాగే మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు చిత్తూరుపై 83 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా...

కేఓఆర్ఎం మైదానంలో కర్నూలు - అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో ఓవర్ నైట్ స్కోరు 135 పరుగులతో బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 82.2 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 486 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో వీరారెడ్డి 251 పరుగులు, జయంత్‌క్రిష్ణ 79, సందీప్‌రెడ్డి 55 పరుగులు చేయడంతో జట్టు భా రీ స్కోరు చేసింది. బౌలింగ్ విభాగంలో మహిత్ 5 వికెట్లు పడగొ ట్టాడు. దీంతో అనంత పురం జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 273 పరుగులు ఆధిక్యత లభిం చింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరు గులు చేసింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 69 పరుగులు చేశారు. దీంతో కర్నూలు జట్టు మరో 158 పరుగుల లోటుతో ఎదురీదుతోంది.

ఏసీఏ మైదానంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రెండో రోజు శనివారం 14 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 61.1 ఓవర్లలో 318 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సిద్దు 74 పరుగులు, వరుణ్ 64 పరుగులు, సాయిచరణ్ 60 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో భార్గవమహేశ్ 5 వికెట్లు సాధించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో 63 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయింది. ఇందులో కారుణ్య ప్రసాద్ 47 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

కేసుల సత్వర పరిష్కార వేదిక జాతీయ లోక్‌అదాలత్



కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కక్షలకు పోయి క్షణికావేశంతో జీవితాలను దుర్భరం చేసుకోకుండా కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్ చక్కటి వేదిక అని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టం న్యాయాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం స్థానిక కోర్టులో నిత్యం పరిష్కార మార్గాలు అందుబాటులో ఉంటాయని కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా సివిల్, క్రిమినల్, తదితర మొత్తం 41కేసులు పరిష్కరించారు. రూ.17,33,678లు, ఎక్సైజ్ కేసులకు సంబంధించి రూ.51,600 అక్కడికక్కడే నగదు రికవరీ చేపట్టి సమస్యలను పరిష్కరించారు. లోక్‌అదాలత్ సభ్యులు అశోక్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పెద్ద పీరు మెరవణి



కోలాహలంగా పెద్దపీరును మెరవణి చేస్తున్న యువత

తంబళ్లపల్లె, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వారం రోజులుగా పీర్ల చావిడిలో పీర్లను కొలువు దీర్చి మొహర్రం పండుగను హిందూ, ముస్లింలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి మొక్కుబడి ఉన్న భక్తులు మల్లెపూలు, రోజాలతో అల్లిన బాషికాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి పెద్ద పీరుకు సమర్పించారు. ముజావర్లు ఆ బాషికాలను పెద్ద పీరుకు అలంకరించి శనివారం తెల్లవారుజామున మెరవణి చేశారు. అనంతరం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేసి డప్పు చప్పుళ్ల మధ్య యువత కోలాహలంగా పట్టణంలో ఊరేగించారు. ఆదివారం పీర్లకు జలాధి ప్రవేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కందుకూరులో...



కందుకూరు పురవీధుల్లో ఊరేగుతున్న పీర్లు

పెద్దతిప్పసముద్రం జూలై 5 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో మొహర్రం పండుగను పురస్కరించుకుని ఐదు రోజులుగా పీర్లను చావడిలో కొలువుదీర్చారు. పవిత్రమైన సందర్భంలో శనివారం వేకువజామున పీర్ల ముజావర్లు ముక్తియార్ ఖాద్రీ పీర్లను ప్రత్యేక పుష్పాలు, బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కందుకూరులో జరిగిన పెద్దపీర్ల మెరవణి తిలకించేందుకు సమీప గ్రామాల భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. భక్తులు ధూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించి ముజావర్లచే చదివింపులు చేయించారు. మెరవణికి ఎస్‌ఐ హరిహర ప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు బషీర్ సాబ్, చాంద్‌బాష, వెంకట్రమణ, రామూర్తి, నల్లచెరువు రెడ్డిబాష, ముక్తియార్ ఖాద్రి పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యత

జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్



ధర్మకర్తల మండలి దరఖాస్తు దారులతో జిల్లా దేవదాయ అధికారులు

పీలేరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో భక్తుల తాకిడికి అనుగుణంగా మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్, కార్యనిర్వహణాధికారి రవీందర్ రాజు తెలిపారు. శనివారం వారు పీలేరు గ్రామదేవత రౌద్రాల అంకాలమ్మ ఆలయాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరి జీవితంలో దైవ చింతన తప్పనిసరన్నారు. పీలేరు గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ, చెన్నకేశవ స్వామి ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలు పరిశీలించారు. రౌద్రాల అంకాలమ్మ ఆలయ ఛైర్మెన్ పదవి ఆశిస్తున్న రామక్రిష్ణారెడ్డి సహా 11 మంది కమిటీ సభ్యుల వివరాలు సేకరించారు. త్వరలోనే ప్రకటన ఉంటుందని వారు తెలిపారు. తనిఖీ అధికారి శశికుమార్, దరఖాస్తు దారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 71 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు విచారిస్తున్న న్యాయమూర్తి

పీలేరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పీలేరులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 71 కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.1.42 లక్షల చెల్లింపులు జరిగాయి. జిల్లా 11వ అదనపు జిల్లా ఇన్‌చార్జ్ జడ్జి పీవీఎస్ సూర్యనారాయణ, చిత్తూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి శంకర్ రావు, పీలేరు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసు కేసులు విచారించి తీర్పు వెలువరించారు. కార్యక్రమంలో పీలేరు బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మదనపల్లెలో 169 కేసులు పరిష్కారం

మదనపల్లె టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోర్టు భవన సముదాయాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 169 కేసులు పరిష్కారమయ్యాయి. రెండో అదనపు జిల్లా జడ్జి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే దాకా ఈ కేసులు పరిష్కార దిశగా నడిచాయి. 25 సివిల్, 144 క్రిమినల్ కేసులు రాజీతో పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.77,01,580 పరిహారం అందేలా న్యాయాధికారులు తీర్పు వెల్లడించారు.

గ్రామాల్లో చెత్తసేకరణను పరిశీలించిన ఎంపీడీఓ



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్ తదితరులు

నిమ్మనపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చేపడుతున్న చెత్త సేకరణను శనివారం ఎంపీడీఓ రమేష్ పరిశీలించారు. సామకోట వారిపల్లి, అగ్రహారం పంచాయతీలో పర్యటించి చెత్త సేకరణపై దిశా నిర్దేశం చేశారు. అంబుడ్స్‌మెన్‌లు ఖచ్చితంగా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లో వేసి వాటి ద్వారా ఎరువు ను తయారీకి దోహదపడాలన్నారు. సర్పంచ్ ఉషారాణి, కార్యదర్శి వెంకటరమణ, ఎంసీఓ గుర్రప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

తవ్వేశారు... వదిలేశారు

- పట్టించుకోని అధికారులు
- వ్యాపారులు, పాదచారులకు ఇక్కట్లు
- బాడుగలు ఎలా చెల్లించాలి ● పనులు జరిగేదెన్నడు



ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద తవ్వి వదిలేసిన మురుగునీటి కాల్వ

పీలేరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మురుగు నీటి కాల్వల పునర్ నిర్మాణంలో భాగంగా పట్టణంలో ఎక్స్‌కవేటర్లతో కాల్వలు తవ్వేసి పనులు చేయకుండా వదిలేయడంతో వ్యాపారులు, పాదచారులు, స్థానికులు వాహన చోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. అదిగో ఇదిగో అంటూనే ఏడు నెలలు గడిపారు. అయినా పనుల్లో పురోగతి కానరావడం లేదు. దీంతో ఆర్టీసీ బస్టేషన్ సముదాయం పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎల్‌బీఎస్ మార్గంలోని ఆర్టీసీ బస్టేషన్, తిరుపతి మార్గం, మదనపల్లె మార్గంలోని సుధాసుధీర్ వీధి తదితర ప్రాంతాల్లో మురుగు నీటి కాల్వలు మట్టి, మురుగుతో పూడి పోయింది. దీంతో చిరు జల్లులు కురిసినా రోడ్లపైకి మురుగు నీటి ప్రవాహం పారేది. దీంతో వాహన చోదకులు, వ్యాపారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎస్‌వీమహల్, ఆర్టీసీ బస్టేషన్, మదనపల్లె క్రాస్ తదితర ప్రాంతాలు మురుగు నీటితో కాల్వలను తలపించేవి. మురుగు నీటి కాల్వలు పూడిక తీయడం, కాల్వల్లో నెలకొన్న ఆక్రమణలు తొలగించి కాల్వలు నిర్మించాలని సదాశయంతో గత ఈఓ పనులకు శ్రీకారం చుట్టారు. తర్వాత ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్టేషన్ సముదాయం వద్ద పండ్లు, పూల వ్యాపారులు ఏడు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న కాల్వలు పెకలించి వదిలేయడంతో షాపుల వద్ద కట్టెలతో సొంతంగా డబ్బు పెట్టుకుని కొందరు, బాడుగ చెల్లిస్తూ కొందరు తాత్కాలికంగా దారి ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు మురుగు నీటి కాల్వలు వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నెలనెలా ఎలా వేలకు వేలు బాడుగలు చెల్లించాలని వాపోతున్నారు. ఆర్టీసీ బస్టేషన్‌కు వెళ్లే ప్రధాన దారి సైతం కాల్వ నిర్మాణ పేరిట పెకలించడంతో దుకాణాలు మూతపడ్డాయి. నిత్యం దుర్గంధం భరించలేక వ్యాపారులు, ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవ పరిస్థితులను గుర్తించి సత్వరం మురుగు నీటి కాల్వల నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

దుర్గంధం భరించలేం...



మురుగునీటి కాల్వలు తవ్వేసి అర్థంతరంగా అలాగే వదిలేయడంతో నిత్యం దుర్గంధం భరించలేకున్నాం. పండ్ల వ్యాపారం పూర్తిగా దెబ్బతిన్నాయి. కాల్వ నిర్మాణంలో హడావిడి చేసి అర్థంతరంగా వదిలేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కాల్వపై కట్టెల దారి కోసం నెలకు రూ. 2500 చెల్లిస్తున్నాం. ఏమి తినాలి, ఎలా బతకాలి.

ఎస్. ఇనయతుల్లా,
పండ్ల వ్యాపారి, పీలేరు

వ్యాపారం దెబ్బతినింది



పంచాయతీ అధికారులు హడావిడిగా ఉన్న కాల్వలు బాగు చేస్తామని ఎక్స్‌కవేటర్లతో తవ్వేశారు. ఇప్పటికి ఏడు నెలలు పైబడుతున్నా ఇంకా పనులు ప్రారంభించలేదు. పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించు కోవడం లేదు. నెలనెలా వేలకు వేలు అద్దె చెల్లించడం గగనంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

నరేష్, బంగారు వ్యాపారి,
ఆర్టీసీ కాంప్లెక్స్ పీలేరు.

సంప్రదించి చర్యలు తీసుకుంటా

పీలేరు ఆర్టీసీ బస్టేషన్, పరిసర ప్రాంతాల్లో మురుగు నీటి కాల్వలు ఎక్స్‌కవేటర్లతో తవ్వేసి వదిలేసిన విషయం వ్యాపారులు తమ దృష్టికి తెచ్చారు. దీనిపై ఉన్నతాధికారులతో సంప్రదించి సత్వరం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. కాల్వల నిర్మాణంలో నిర్లక్ష్యం ఉండదు. ఇటీవలే నేను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించాను, సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటా.

లతీఫ్‌ఖాన్, ఇన్‌చార్జి ఈఓ





షాపుల వద్దకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న కర్రల దారి - కాల్వ పెకలించి రోడ్డుకు అడ్డంగా వేసిన బండలు

విట్నెస్ అధికారి నియామకం రద్దు చేయాలి

పీలేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): జరగనున్న మెగా పేరెంట్స్-టీచర్ సమావేశం(పీటీఎం)లో విట్నెస్ అధికారి నియామకం రద్దు చేయాలని యూటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు సదాశివరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేఖరులతో మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి గురించి చర్చించుకునే కార్యక్రమాన్ని డాక్యుమెంటు కార్యక్రమంగా మార్చడం తగదన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు వినియోగించబోమని గతంలో హామీ ఇచ్చి ఇప్పుడు కొన్ని పనులు అప్పగించడం సమంజసం కాదన్నారు. పాఠశాలలు ప్రారంభమైన నెల రోజు ల్లోపే యోగా పేరుతో వారం రోజులు, పీటీఎం పేరుతో మరో వారం రోజుల బోధన సమయాన్ని హరిస్తున్నారని ఆరోపించారు.

డెంగ్యూ, అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, అతిసార పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జులేఖాబేగం సూచించారు. శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రగుంట్లబావిలో డెంగ్యూ వ్యతిరేక మాసం, స్టాప్ డయేరియా కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, సీహెచ్‌ఓ సౌజన్య, వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలి

మదనపల్లె టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వారిలో ఇమిడి వున్న సృజనాత్మక శక్తిని పెంచుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి సూచించారు. శనివారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం చేపట్టిన యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్(వైఎఫ్‌ఎస్‌ఐ) కార్యక్రమంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైఎఫ్‌ఎస్‌ఐ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇందులో ఆరు మాడ్యూల్స్ వుంటాయని, వాటిని పూర్తి చేశాక వచ్చే సర్టిఫికెట్లలో విద్యార్థుల పేర్లు ప్రభుత్వానికి పంపుతామన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా



ఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

మదనపల్లె టౌన్/ములకలచెరువు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటుచార్జీల పేరుతో రూ.15.485 కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. సీపీఐ నేతలు కృష్ణప్ప, సాంబశివ, మురళి, తిరుమలప్ప, దేవ, ముభారక్, రాధ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో చౌడసముద్రం పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడీ గోవిందరెడ్డి, ఎంపీడీఓ హరినారాయణకు వినతి పత్రాలు అందజేశారు. రైతు సంఘం కార్యదర్శి రామునాయుడు, మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు నిజాముద్దీన్, డప్పు కళాకారుల సంఘం నాయకుడు వెంకటస్వామి, నేతలు సుబ్బన్న, ఎల్లప్ప, అమరావతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హనుమన్న ఆలయానికి కుంభాభిషేకం



మదనపల్లె అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అంజనేయ స్వామి ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించారు. మదనపల్లె మండలం, వలసపల్లె గ్రామం, కాకరకాయలపల్లెలో కొత్తగా నిర్మించిన ఆంజనేయస్వామికి కుంభాభిషేకంలో భాగంగా శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వెంకటరమణ సుమారు రూ. 60లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. రోజు ఆలయంలో భజనలు, విశేష పూజలు, సహస్ర పారాయణం నిర్వహిస్తునట్లు నిర్వహకులు తెలిపారు. ఇందులో భాగంగా 41 రోజులు ఆలయంలో పూజలు చేస్తునట్లు తెలిపారు.

ప్రమోషన్లు ఇవ్వాలని నిరసన



బస్టాండ్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

మదనపల్లె, అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం రెండో రోజు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ గేట్ వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్‌వి కుమార్, డిపో అధ్యక్షుడు పూల శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్, జాయింట్ సెక్రటరీ సుగుణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ ఫైళ్లను కదిలించి వెంటనే ఇంప్లిమెంట్ చేయాలన్నారు. సీసీఎస్‌లో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని కోరారు. కరెంటు బస్సులు సంస్థే నడపాలని కోరారు.

యువత సేవాభావం అలవర్చుకోవాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో యువత సేవాభావం అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి పేర్కొన్నారు. శనివారం కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నగిరిమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలలోని 160 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్, కంటి, దంత, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రిచర్డ్స్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖ అంజన్నకు ప్రత్యేక పూజలు



కలకడ జూలై 5 (ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వేకువజామునే పూలమాలలు, తమలపాకుల హారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తదుపరి పూజ కార్యక్రమాలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అమ్మవారికి శఠారి బహూకరణ



ఈఓకు శఠారిని అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మ అమ్మవారికి దాతలు శనివారం వెండి శఠారిని బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన నక్కా నాగరోజా, సతీష్ దంపతులు అమ్మవారికి మొక్కుగా 267 గ్రాముల బరువు గల వెండి శఠారి తయారు చేయించారు. ఈ శఠారిని ఆలయ ఈఓ మంజులకు అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

మొహర్రం వేడుకలు ప్రశాంతంగా చేసుకోవాలి

రామసముద్రం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగే మొహర్రం వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఎస్‌ఐ రమేష్‌బాబు సూచించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు కుల, మతాలకు అతీతంగా చేసుకునే మొహర్రం వేడుకల్లో వివాదాల జోలికి వెళ్లవద్దని, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. శని, ఆదివారం మొహర్రం పండుగ జరిగే గ్రామాల్లో పోలీస్ పికెట్ నిర్వహిస్తామన్నారు.

'విగ్రహాలకు రక్షణ కరువు'

పీలేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంబేడ్కర్, గౌతమ బుద్ధుడి విగ్రహాలకు రక్షణ కరువైందని ఎంఆర్‌పీఎస్ నేత ముల్లంగి చంద్రయ్య పేర్కొన్నారు. గర్నిమిట్టలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవీపల్లె, మల్లారపు వాండ్లపల్లె గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల ధ్వంసం ఘటనలు మరువక ముందే మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెలో బుద్ధ విగ్రహం ధ్వంసం చేశారన్నారు. శ్రీనివాసులు, నాగేశ్వర, ఆంజనేయులు, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

మదనపల్లె అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కలకడ, రామసముద్రం గ్రామీణ రూట్లలో ప్రయాణీకుల ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో డిప్ తీసినట్లు డిపో మేనేజరు అమరనాథ్ పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణీకులు ప్రయాణం చేసి ఆర్టీసీకి ఆదాయం చేకూర్చాలని కోరారు. అసిస్టెంట్ మేనేజరు గీత, ప్రయాణీకులు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లే తగిన గుర్తింపు



సీటీఎం-1లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులను నిర్లక్ష్యంగా చూడకుండా సామాజిక పింఛన్లు ఇచ్చి తగిన గుర్తింపు తెచ్చామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సీటీ ఎం-1 పంచాయతీ గంగాపురంలో సుపరిపాలన- తొలిఅడుగులో ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను ప్రజలు వివరించగా పరిష్కరించమని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గురుమూర్తిగౌడ్, సురేష్ రాజు, టీడీపీ నేతలు చల్లా నరసింహులు, రెడ్డిరామ్‌ప్రసాద్, పోతబోలు సుధాకర్, జిలాని, రామ్మూర్తి, శ్రీనివాసులు, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఆర్‌ఐ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా...

తంబళ్లపల్లె, జూలై 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర అన్నారు. గోపిదిన్నె ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు రమణారెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, వార్డు సభ్యుడు జగదీష్, భాస్కర్, జయరాంరెడ్డి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ఇంటింటి ప్రచారం

పీలేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలో టీడీపీ నేతలు ఉధృతంగా నిర్వహిస్తున్నారు. పట్టణం సహా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ విజయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పేదలు మెచ్చిన పార్టీ టీడీపీ

గుర్రంకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి):పేద ప్రజలు మెచ్చిన పార్టీ అని టీడీపీ నేతలు అన్నారు. తరిగొండలో శనివారం సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో నేతలు జగదీష్, చంద్రబాబు, మహాత్మారెడ్డి, మురళీ, చలమారెడ్డి, నారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.